



వర్షంలోనే బుర్రిలంక, తీపర్రు ర్యాంపులను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

జిల్లా అధికారుల ఉరుకులు.. పరుగులు

- జూలై 15 వరకు నివేదిక ఇవ్వాలన్న సుప్రీం
- ర్యాంపులను పరిశీలించిన జిల్లా అధికారులు
- అంతా సక్రమంగానే ఉందన్న కలెక్టర్
- నేడు సుప్రీం కోర్టుకు నివేదిక..17 ర్యాంపుల మూత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వంతెనల పక్కన ఎక్కడా ఇసుక తవ్వకాలు జరగడంలేదు.. ఇరిగేషన్ శాఖ ఇచ్చిన అనుమతుల మేరకే ఇసుక తవ్వకాలు సాగుతున్నాయంటూ జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. ఇసుక తవ్వకాల నేపథ్యంలో ఓపెన్‌రీచ్‌లు, బోట్స్‌మన్ సొసైటీ, డ్రెడ్జింగ్ పనులపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులతో కలిసి ఎట్టకేలకు ఇసుక ర్యాంపులను జిల్లా అధికారులు తనిఖీ చేశారు.కడియం మండలం బుర్రిలంక- వేమగిరి ఓపెన్ రీచ్, పెరవలి మండలం తీపర్రు- ఉసులుమర్రు, పెండ్యాల -కానూరు, నిడదవోలు మండలం పందలపర్రు, కొవ్వూరు మండలం లోని కుమారదేవం-చిడిపి, తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం, బల్లిపాడు ర్యాంపులను పరిశీలించారు.. గోదావరి నదీ ప్రాంతంలో ఇరిగేషన్ అధికారుల అనుమతితోనే తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ఇరిగేషన్ అధికారులు బ్యారేజికి 3 కిలోమీటర్ల పరిధి 12 కిలోమీటర్ల వరకూ అనుమతులు మంజూరు చేశారన్నారు. ఎవరూ కూడా వంతెనలకు 500 మీటర్ల పరిధిలో తవ్వకాలు చేయడం లేదని స్పష్టం చేశారు. అధికారులు ప్రతి రోజూ పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ఓపెన్ రీచ్‌ల వద్ద గోదావరి నది ప్రాంతంలో వాహనాలు, యంత్రాలు వాడకూడదనేది అమలులో ఉందన్నారు. కానీ ట్రిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు ఉపయోగిస్తున్నట్టు తమ దృష్టికి రావ డంతో ఇప్పటికే వాటిని సీజ్ చేసినట్టు చెప్పారు. బోట్స్‌మన్ సొసైటీలు డ్రెడ్జింగ్ చేయకూడదని, కానీ డ్రెడ్జింగ్ అనుమతి పొందిన వారు చేసుకోవ చ్చన్నారు. ఇసుక డంపింగ్ చేసిన ప్రాంతాల్లో బోట్స్‌మన్ సొసైటీల ద్వారా అమ్మకాలు చేసుకుని, వాహనాల ద్వారా రవాణా చేసుకోవచ్చన్నారు. ఓపెన్ రీచ్‌ల నిర్వాహకులకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, జేసీ ఎస్.తేజ్‌భరత్, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, కొవ్వూరు సబ్- కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, మైన్స్ ఏడీ ఎం. సుబ్రహ్మణ్యం, సెబ్ అధికారి వి.సోమశేఖర్, గ్రౌండ్‌వాటర్ డీడీ వై.శ్రీనివాస్, ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు తనిఖీల్లో పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలతో కదలిక..

ఇసుక ర్యాంపులపై సుప్రీం కోర్టు జూలై 15న తీర్పు చెప్పే వరకూ ప్రతి సోమవారం నివేదిక ఇవ్వాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇంత వరకూ అక్రమాలను పట్టించుకోని అధికారులు ఆదివారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ర్యాంపులను పరిశీలించారు. గోదావరి బ్యారేజీ నుంచి నీరు వదలడం.. వర్షం కారణంగా బ్యారేజీ కింది ర్యాంపులన్నీ ఇప్పటికే మూతపడ్డాయి. ఒక్క సీతానగరం మినహా మిగతా ప్రాంతాల్లో సుమారు 17 ర్యాంపులు మూత పడ్డాయి.ఆయా ర్యాంపులను ఆదివారం పరిశీలించారు. దీంతో గోతులు తప్ప.. యంత్రాలతో తవ్వే దృశ్యాలేమీ కానరాలేదు. సీతానగరంలో ఇంకా ఓపెన్ ర్యాంపుల్లో ఇసుక తీసేస్తున్నారు. వీటిని మరొక రోజు పరిశీలించనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ర్యాంపులపై సోమవారం సుప్రీంకోర్టుకు నివేదిక ఇవ్వనున్నారు.

కళ్లుండీ చూడలేకపోతున్న అధికారులు..

అధికారులు కళ్లుండీ చూడలేకపోతున్నారు.. చెవులుండీ వినలేకపోతున్నారు.. ఒక పక్కన అక్రమంగా ఇసుక తవ్వేస్తున్నా అధికారులు కాదని వాదించడం కొసమెరుపు.. జిల్లా అధికారులే అక్రమార్కులకు వంత పాడు తుంటే ఇంకేం చేయాలనేది పర్యావరణ ప్రేమికుల ఆందోళన. కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం పర్యటించినా అఖండ గోదావరిలో డ్రెడ్జింగ్ మాత్రం ఆగలేదు.కొవ్వూరు బ్రిడ్జి పక్కనే యంత్రాలతో ఎగుమ తులు సాగుతున్నాయి. ఒక కాంట్రాక్టు సంస్థ డ్రెడ్జింగ్ అనుమతి పొందిన సంగతి నిజమే. కానీ నిబంధనలు పాటించ డంలేదు ఇక్కడ పెద్ద యంత్రా లు లేవు. ఓ మోస్తరు డ్రెడ్జింగ్ మిషన్లు తెచ్చి ఇష్టానుసారం నదీ గర్భంలోని ఇసుక తోడేస్తున్నారు. దానిని ఒడ్డుకు తరలించి, అమ్మేస్తున్నా రు.దీనికి లెక్కా పత్రం లేదు. కాతేరులో బోట్స్‌మన్ సొసైటీలు కూడా డ్రెడ్జింగ్ బోట్లతో ఇసుక తోడేస్తున్నా కనీసం అధికారులు పట్టించుకోలేదు.



చివరికి.. చింతేగా!

అష్టకష్టాలు పడి అప్పులు చేసి మరీ పంటలు పండించిన అన్నదాతకు చివరికి మిగిలేది కష్టమే.. ధాన్యం అమ్మినా సొమ్ము చేతికి అందక.. చేసిన అప్పులు తీరక రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఏం చేయాలో దిక్కుతోచక చూస్తున్నారు.
గత ఐదేళ్లుగా ఏం జరిగిందో ఈ సారి అదే జరిగింది. జూన్ నెల వచ్చేస్తున్నా రబీ ధాన్యం కొను గోళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొన్న ధాన్యానికి పూర్తిగా సొమ్ములు చెల్లించలేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మరొక పక్క ఖరీఫ్ సాగు దగ్గరపడింది.. ఈ నేపథ్యంలో దిక్కుతోచక తలలు పట్టుకుంటున్నారు. ఇంకో పక్క నాలుగు రోజులు వర్షాలనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రోడ్డుపై ఉంచిన ధాన్యం చూసి అన్నదాత ఆందోళన చెందుతున్నాడు.

- అన్నదాతకు మిగిలేది కష్టమే..
- ఈ ఏడాది లక్ష్యం 3.2 లక్షల మెట్రిక్ టన్నులు
- కొనుగోళ్లు 2.25 లక్షల మెట్రిక్ టన్నులే
- ఇంకా రైతులకు రూ. 225 కోట్లు బకాయి
- సకాలంలో సొమ్ములందక ఇక్కట్లు
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- ఖరీఫ్ సాగుపై నెలకొన్న ఆందోళన

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అన్నదాత ఆందోళన చెందుతున్నాడు..ఏ ఏడాది చూసినా అన్నదాతకు చివరికి మిగిలేది కష్టమే. ప్రభుత్వ చర్యలతో గత ఐదేళ్ల ప్రతి సంవత్సరం కష్టాలు పెరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది అదే జరిగింది. జిల్లాలో 59,348 హెక్టార్లలో వరి ఆయకట్టు ఉంది. ఈ సారి 55,315 హెక్టార్లలోనే రబీ సాగు చేశారు. ఇప్పటికే 54,853 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. అమ్మకానికి 1372 టన్నుల ధాన్యం సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్నారు. జిల్లాలో మొత్తంగా సుమారు 5.5 లక్షల మెట్రి క్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. అయితే పౌర సరఫరాల సంస్థ ద్వారా ప్రభుత్వం 3.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.మిగిలిన ధాన్యం స్థానికంగా అమ్ముకోవాల్సిందే. కొంత మంది రైతులు మిల్లర్లు, కమీషన్‌దార్లకు విక్రయించేశారు. ప్రభుత్వం ఇప్పటి వరకూ 2,25,337.88 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. దాని విలువ రూ.491.71 కోట్లు. రైతులకు రూ.277.84 కోట్లు మాత్రమే జమచేశారు. ఎన్నికలకు వారం రోజుల ముందు వరకూ ధాన్యం సొమ్ము జమ చేశారు. తర్వాత పట్టించుకోలేదు. ఇంకా సుమారు రూ.225 కోట్లు పెండింగ్ ఉంది. ఎన్నికలయ్యాయి. కొనుగోళ్లు మందగించాయి. అయినా పట్టించుకునే నాథుడు లేదు. ఇంకా రైతుల నుంచి ప్రభుత్వం సుమారు లక్ష టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఇదంతా ఎప్పుడు జరుగుతుందో మరి. రైతులు ఏరువాక సాగేదెలా అని ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం కంటే..దళారులే బెటర్

గోకవరం,మే 19 : గోకవరం మండలంలో ఈ ఏడాది 1535 హెక్టార్లలో వరి సాగు చేశారు. పండిన పంటను కొంతమంది రైతులు ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వానికి విక్రయించారు. ఇప్పటి వరకు రైతుల నుంచి ప్రభుత్వం 498.040 మెట్రిక్ టన్నుల దాన్యాన్ని సేకరించింది. రైతులకు రూ.1.08 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.79.84 లక్షలు మాత్రమే చెల్లించింది. ఇంకా రూ. 28.87 లక్షలు రైతులకు ప్రభుత్వం బకాయి ఉంది. రెండు మూడు రోజుల్లో రైతులకు బకాయి ఉన్న మొత్తాన్ని చెల్లిస్తామని అధికారులు చెప్పుకొస్తున్నారు. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర కంటే బయట మార్కెట్‌లోనే ధాన్యాన్ని మరింత ఎక్కువకు కొనుగోలు చేస్తున్నారంటూ చాలా మంది రైతులు దళారులను ఆశ్రయి స్తున్నారు. రబీ చాలా వరకు బయట విక్రయించేందుకే మొగ్గు చూపారు.

రబీ సొమ్ములు అందలేదు..

గోపాలపురం, మే 19 : రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాదు, ఒక వేళ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం అమ్మితే సమయానికి సొమ్ములు చేతికిరావు. ఇది వరి రైతుల పరిస్థితి. గోపాలపురం మండలంలో ఈ ఏడాది రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 360 మంది రైతుల నుంచి 4041 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రూ.8.82 కోట్లు జమ చేశారు. పంట కాలం పూర్తయినా నేటికి 14 మంది రైతులకు సంబంధించిన సొమ్ము రూ.20 లక్షలు వారి ఖాతాలో జమ కాలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సిద్ధమవడంపై ఆందోళన చెందుతున్నారు.

చంద్రబాబు హయాంలోనే బెటర్..



గత కొన్నేళ్లుగా వరి సాగు చేస్తున్నా. చంద్రబాబు హయాంలో 21వ రోజుకు సొమ్ములు రైతు ఖాతాలో జమయ్యేవి. జగన్ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. సకాలంలో సొమ్ములు జమ కావడంలేదు. దీంతో ధాన్యం రైతులకు ప్రభుత్వంపై నమ్మకం పోయింది. నేడు కోసిన ధాన్యాన్ని కళ్లంలోనే దళారులు సరసమైన ధరకు కొనుగోలు చేస్తున్నారు. - ఆచంట కోటేశ్వరరావు, కౌలురైతు, చెరుకుమిల్లి



మండలాల వారీ కొనుగోళ్లు ఇలా..

ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లు అంతంతమాత్రంగానే జరిగాయి. అయినా నేటి వరకూ సొమ్ములు మాత్రం అందలేదు. అనపర్తి మండలంలో 702.24 మెట్రిక్ టన్నులు, బిక్కవోలులో 1047.48 టన్నులు, చాగల్లులో 23,724.4 టన్నులు, దేవరపల్లిలో 11,312.4 టన్నులు, గోకవరంలో 498.04 టన్నులు కొనుగోలు చేశారు. గోపాలపురంలో 4,041.56 టన్నులు,కడియంలో 11,731 టన్నులు, కోరుకొండలో 973.64 టన్నులు, కొవ్వూరులో 2786.24 టన్నులు, నల్లజర్లలో 5895.16 టన్నులు, నిడదవోలులో 46673.04 టన్నులు, పెరవలిలో 21136 .56 టన్నులు, రాజమహేంద్రవరం రూరల్‌లో 1260 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. రాజానగరంలో 8868 .52 టన్నులు, రంగంపేటలో 498.52 టన్నులు, సీతానగరంలో 6620.08 టన్నులు, తాళ్లపూడిలో 16,163 మెట్రిక్ టన్నులు ఉండ్రాజవరంలో 37,106.76 టన్నులు కొనుగోలు చేశారు. మొత్తం జిల్లాలో 225539.6 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా పలుమండలాల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయి.

తాళ్లపూడిలో రూ.81.72 లక్షలు బకాయి..

తాళ్లపూడి, మే 19 : తాళ్లపూడి మండలంలో రబీ సీజన్‌లో ధాన్యం కొను గోళ్లు 90 శాతం పూర్తయినట్టు ఏవో రుచిత తెలిపారు. ఇప్పటి వరకూ 16,163 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 15.84 కోట్లు రైతులకు చెల్లించాం. 81.72 లక్షలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. సుమారు 300 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయవలసి ఉంది.

పెరవలిలో ఇంకనూ పడని సొమ్ములు

పెరవలి, మే 19 : మండలంలో వరి కోతలు పూర్తయ్యాయి. సగం మంది రైతులు ప్రభుత్వంతో ప్రమేయం లేకుండా ప్రైవేటు వ్యక్తులకు విక్రయించుకోగా కొంత మంది రైతులు మాత్రం ప్రభుత్వానికి విక్రయించారు. మండల వ్యాప్తంగా 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించారు. కొంత మందికి మాత్రమే సొమ్ములు పడ్డాయి. చాలా మంది రైతులకు మాత్రం సొమ్ములు పడకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.ధాన్యం విక్రయించిన అనంతరం వారానికే బ్యాంక్‌లో సొమ్ములు పడాల్సి ఉన్నా నెల రోజులైనా నేటికీ పడకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

19 రోజులుగా ఆగిన చెల్లింపులు

చాగల్లు, మే 19 : రైతులకు ధాన్యం సొమ్ములు చెల్లించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలో 3360 హెక్టార్లలో రైతులు రబీ సాగుచేశారు. రైతులు మిల్లులకు ధాన్యం తరలించినా సొమ్ములు చెల్లింపులో ఇబ్బం దులు పడుతున్నారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు రైతులు నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సొమ్ములు చెల్లించారు. నేటి వరకూ మిగిలిన సొమ్ములు చెల్లించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.





కురిసింది చిరుజల్లు : వాన కారణంగా ఖాళీగా ఉన్న నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్

కురిసింది వాన..



రోజులాగే ఉదయమే భానుడు వచ్చాడు.. అంతకంతకూ తన ప్రతాపం చూపుతూనే ఉన్నాడు.. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలు దాటింది.. భానుడి ఉగ్రరూపం అలాగే ఉంది.. నాలుగు రోజులు వర్షాలన్నారు.. ఎక్కడా ఆ జాడే లేదు.. అనుకుంటుండగానే ఆకాశం నల్లగా మారిపోయింది.. అయినా ఉక్కపోత మాత్రం తగ్గలేదు.. ఆ ఏం వాన పడుతుందిలే అనుకున్నారంతా.. అంతే చిరు జల్లులతో ఆరంభమైన వాన అలా అలా పెరిగింది.. భానుడికి దారివ్వకుండా సాయంత్రం వరకూ పడుతూనే ఉంది.. జిల్లా వ్యాప్తంగా సుమారు 3 గంటల పాటు వానపడింది. సాయంత్రం 4 గంటలకు వరుణదేవుడు కాస్త తెరిపిచ్చాడు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో జనం ఊపిరిపీల్చుకున్నారు.. - నిడదవోలు /రాజమహేంద్రవరం సిటీ

కమనీయం..సత్యదేవుడి కల్యాణం..



అన్నవరం రత్నగిరిపై ఆదివారం సత్యదేవుడు, అనంతలక్ష్మి దివ్య కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. భారీగా భక్తజనం తరలివచ్చారు. ఈ పెళ్లికి సీతారాములు పెళ్లి పెద్దలుగా వ్యవహరించగా వారిని పక్కనే మరో వేదికపై స్వామి అమ్మవార్లను ఆశీనులు గావించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, సుగంధ భరిత పుష్పాలతో ఆ ప్రాంతమంతా కల్యాణ శోభతో నిండింది.. పట్టుపీతాంబరాలు, విశేష ఆభరణాలతో నుదుట తిలకం, బుగ్గన చుక్కతో స్వామి,అమ్మవార్లు దివ్యతేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. - వివరాలు 7లో..

నిలిచిన రిజిస్ట్రేషన్లు

- జగనన్న సర్వే పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లకు బ్రేక్
- రాజానగరం నియోజకవర్గంలో ఇబ్బంది
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటున్న కక్షిదారులు



సీతానగరం మే 19 : వైఎస్ఆర్ జగనన్న సమగ్ర భూ సర్వే కారణంగా రాజానగరం నియోజకవర్గంలోని మేజర్ గ్రామాల్లో భూమి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.దీంతో ఎప్పుడు జనంతో కిటకిటలాడే సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు వెలవెలబోతున్నాయి.దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం, వంగలపూడి, శింగవరం, సీతానగరం, నాగంపల్లి, ముగ్గుళ్ళ, కూనవరం, బొబ్బిల్లంక, నల్గొండ గ్రామాల వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కోరుకొండ మండలంలో కాపవరం, బుచ్చంపేట ,బూరుగుపూడి తదితర సుమారు 10 గ్రామాలు రాజానగరం మండలంలోని కొన్ని గ్రామాలు రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. జగనన్న సమగ్ర భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో గతంలోని సర్వే నెంబర్ల స్థానంలో ఎల్‌పీ నెంబర్లు ఇవ్వడం ఆ నెంబర్లు సర్వర్లలో అప్‌లోడ్ చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి ఎదురైంది. ప్రభుత్వ గెజిట్‌లో పొందుపర్చిన తరువాత గాని అప్‌లోడ్ చేయడం కుదరదని తెలుస్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి రైతాంగం లబోదిబోమంటున్నారు. అప్‌లోడ్ చేయాలంటే ఎన్నికల వేళ కష్టమే. కౌంటింగ్ పూర్తయి కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత మాత్రమే అయ్యే అవకాశం ఉన్నందున సుమారు మరొక రెండు నెలల వరకు ఇబ్బందులు తప్పవని తెలుస్తోంది. రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. తనఖా పెట్టుకుని అప్పులు తెచ్చుకుందామన్నా, ఉన్న భూమి అమ్ముకుని అప్పులు తీర్చుకుందామన్నా అవకాశం లేకపోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.క్రయ విక్రయాలు జరగక రిజిస్ట్రారు కార్యాలయాలు ఖాళీగా ఉంటున్నాయి.ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్థానాలు మారినా గెలిచేనా!?



హోం మంత్రి తానేటి వనిత

జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణు

- మంత్రుల స్థానాలపై తీవ్ర చర్చ
- ఎన్నికల ముందు ఇద్దరూ బదిలీ
- వేర్వేరు నియోజకవర్గాల్లో పోటీ
- గోపాలపురం నుంచి వనిత
- రాజమండ్రి రూరల్ నుంచి వేణు
- హోరాహోరీగా సాగిన పోరు
- మరో 15 రోజుల్లో ఫలితాలు
- కూటమి అభ్యర్థులకు మొగ్గు
- వైసీపీ మేకపోతు గాంభీర్యం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు అయిపోయాయి..లెక్కింపు మాత్రమే మిగిలి ఉంది. మరో 15 రోజుల్లో ఎవరు గెలిచారు.. ఎవరు ఓడారు అనేది తేలిపోనుంది. అయినా ఫలితాలపై మాత్రం ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో 5 నియోజకవర్గాలది ఒక ఎత్తు.. రాజమహేంద్రవరం రూరల్, గోపాలపురం నియోజకవర్గాలది మరో ఎత్తు.. ఇక్కడి నుంచి ప్రస్తుతం అధికారంలో ఉన్న ఇద్దరు మంత్రులు పోటీపడ్డారు. ఈ ఇద్దరూ బదిలీపై వచ్చి గతంలో ఉన్న స్థానాల్లో కాకుండా వేరొక స్థానాల్లో పోటీపడడం విశేషం. దీంతో పోలింగ్ తర్వాత జిల్లాలోని ఇద్దరు మంత్రుల గెలుపోటములపై ప్రజల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది. వైసీపీకి వ్యతిరేకంగా ఓ సైలెంట్ వేవ్ ఉందని అందరూ కోడై కూస్తుంటే.. వైసీపీలో కొందరు ఓ పక్క ఓడిపోతామనే భయమున్నా..మరో పక్క మహిళ ఓట్లన్నీ తమకే పడ్డాయి అనుకుంటూ బలవంతంగా తమ ఖాతాలో వేసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన సంగతి తెలిసిందే. వాస్తవానికి ఆయన గత ఎన్నికల్లో అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున పోటీ చేసి గెలిచి.. బీసీల్లోని శెట్టిబలిజ కోటా కింద మంత్రి అయ్యారు. మూడు శాఖలు నిర్వహించారు. కానీ పవరంతా సీఎం జగన్ చేతిలో ఉండిపోవడంతో ఈ మూడు శాఖల ద్వారా ఆయన పెద్దగా గుర్తింపు పొందిందేమీ లేదు. ఎన్నికల ముందు జగన్ ఆయనను బలవంతంగా రామచంద్రపురం నుంచి బదిలీ చేసి రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీ చేయించిన సంగతి తెలిసిందే. తానేటి వనిత గత ఎన్నికల్లో కొవ్వూరు ఎస్సీ నియోజకవర్గం నుంచి గెలిచి ఐదేళ్ల పాటు మంత్రి ఉన్న సంగతి తెలిసిందే. ఆమె మొదట మహిళా శిశుసంక్షేమ శాఖ, ప్రస్తుతం హోంశాఖ మంత్రిగా ఉన్నారు.ఆమెకు ఈ శాఖలు అదనంగా తెచ్చిన పలుకుబడీ ఏమీ లేదు.కానీ హోంమంత్రిగా సొంత నియోజకవర్గంలో బ్యాడ్ అయ్యారు. పైగా అక్కడ ఓ ముఖ్యవర్గాన్ని దూరంపెట్టే ప్రయత్నం చేయడంతో ఏకంగా ఆమె స్థానమే మారాల్సి వచ్చింది.జగన్ ఆమెను కూడా బదిలీ చేసి గోపాలపురం నియోజకవర్గం నుంచి పోటీ చేయించిన సంగతి తెలిసిందే. ఎన్నికల తర్వాత వీరిద్దరూ గెలుస్తారా? ఓడిపోతారా అనేది పెద్ద చర్చనీయాంశమైంది.గోపాలపురం నియోజక వర్గంలో మొత్తం 2,42,763 ఓటర్లు ఉండగా 2,10,399 మంది ఓటేశారు. ఇది 86.67 శాతం. ఇందులో మహిళలు 1,23,793 మంది ఉండగా 1,05,564 మంది ఓటేశారు. పురుషులు 1,18,965 మంది ఉండగా 1,04,831 మంది ఓటేశారు. ఉదయం నుంచి ఓటర్లు పోలోమంటూ రావడంతో కూటమి వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇక్కడ టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజుకే విజయావకాశాలు ఎక్కువ ఉంటాయనే అంచనా ఉంది. దీనిపై జూన్ 4వ తేదీన స్పష్టత రాబోతోంది. ఇక రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీ చేసిన మంత్రి చెల్లుబోయిన వేణుకు కూడా కష్టకాలమనే అంచనాలు ఉన్నాయి.ఈ నియోజకవర్గం ఎపుడూ టీడీపీకి కంచుకోట. నియోజకవర్గంలో మొత్తం 2,72,826 మంది ఓటర్లు ఉండగా 1,99,220 మంది ఓటేశారు.ఇది 73.02 శాతం. ఇక్కడ 1,33,241 మంది పురుష ఓటర్లు ఉండగా 97,530 మంది ఓటేశారు.1,39,561 మంది మహిళా ఓటర్లు ఉండగా 1,01,673 మంది ఓటేశారు. ఇక్కడ రెండుసార్లు విజయఢంకా మోగించిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో వేణు తలపడ్డారు. గోరంట్లకు అభిమాన ఓటర్లు ఉన్నారు. పైగా జనసేన, బీజేపీ ఓట్లన్నీ కలిసొచ్చాయి. దీంతో గోరంట్లదే గెలుపు అనే ప్రచారం జరుగుతోంది. ఇలా జగన్ బదిలీ చేసిన ఇద్దరు మంత్రులకు చుక్కెదురవుతుందని అంచనా.



కల్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న పండితులు



తలంబ్రాల వేడుక

స్వామి, అమ్మవారి దివ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన భక్తజనం



కల్యాణ వైభోగమే..



కనుల పండువగా సత్యదేవుని దివ్య కల్యాణం

కమనీయంగా వేడుక

శోభాయమానంగా మారిన రత్నగిరి

వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

భువనమోహన రూపుడైన సత్యదేవుడి కల్యాణం ఆదివారం రాత్రి రత్నగిరిపై అంగరంగ వైభవంగా జరిగింది. ఆద్యంత రహితుడైన స్వామి, అనంతలక్ష్మి అమ్మవారిని పరిణయమాడిన వేళ ప్రకృతి పరవశించగా రత్నగిరి పులకరించింది. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, సుగంధభరిత పుష్ప పరిమళాలతో స్వామి సన్నిధి అణువణువునా శోభిల్లింది.



అన్నవరం, మే 19: కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం అంకురార్పణతో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహ వచనం నాందీదేవత పఠన నిర్వహించిన అర్చకులు ధ్వజారోహణం చేసి గరుడ ద్విభాగం ఎగురవేసి స్వామికల్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించారు. ఛైర్మన్ ఐ.వి రోహిత్ దంపతులు పండితులకు దీక్షా వస్త్రాలను అందజేశారు. రాత్రి 7 గంటలకు బాజాభజంత్రీలు, వేదమంత్రాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ సత్యదేవుడిని వెండిగరుడ వాహనంపైన అనంతలక్ష్మి అమ్మవారిని వెండి గజవాహనంపై గ్రామోత్సవం జరుపుకుని కల్యాణవేదిక వద్దకు చేరుకున్నారు. సర్వశిల్పకళా శోభితమైన, వివిధ పరిమళ పుష్పాలతో విద్యుద్దీప అలంకరణతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన వార్షిక కల్యాణవేదికపై స్వామి, అమ్మవార్లను అధిష్ఠింపజేసి అర్చకస్వాములు కల్యాణ తంతుకు శ్రీకారం చుట్టారు. ఈ వివాహ కార్యక్రమానికి సీతారాములు పెండ్లి పెద్దలుగా వ్యవహరించడంతో మరో వేదికపై వారిని ఆశీనులు గావించి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం కన్యావరుణలు జరిపి అమ్మవారితో మంగళగౌరీపూజను జరిపించారు. స్వామి, అమ్మవార్ల వంశవృక్షాన్ని వివరించే ప్రవరను వేదపండితులు పఠించారు. ద్విజత్వాన్ని ప్రసాదించే సువర్ణ యజ్ఞోపవీతాన్ని మంత్రపూర్వకంగా స్వామికి అలంకరించారు. శ్రీచరణుని పాదాలను పవిత్రజలంతో కడిగి పాద ప్రక్షాళన కార్యక్రమం మదుపర్క ప్రాశన జరిపి మదుపర్కాలను స్వామికి ధరింపచేశారు. చతుర్వేద పండితులు దేశకాలమాన పరిస్థితులు వివరించే మహాసంకల్పం చెప్పి చూర్ణికమంత్రాలు పఠించారు. సుముహూర్త వేళ భక్తరక్షణలో ఒకరికొకరు బాసటగా ఉండాలంటూ జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని స్వామి, అమ్మవార్లు ఒకరి శిరస్సుపై మరొకరు ఉంచారు. అమ్మవారికి దివ్యతేజస్సు ప్రసాదించే యుగచ్ఛిద్రాభిషేకం నిర్వహించగా భక్తజన గోవింద నామ స్మరణ మధ్య మాంగల్యం తంతునా నేనా లోకరక్షణ హేతునా అంటూ స్వామి, అమ్మవారి మెడలో మూడుముళ్లు వేశారు. స్వామి, అమ్మవార్లు ఒకరి శిరస్సుపై మరొకరు మంచిముత్యాల తలంబ్రాలు వేసుకుంటూ భక్తులకు వేడుక కలిగించారు. పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలతో నుదుట తిలకం, బుగ్గన చుక్కతో స్వామి, అమ్మవార్ల దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు.

కల్యాణ తంతును వీక్షిస్తున్న అధికారులు



ఈ కల్యాణ తంతును ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు నిర్వహించగా వేడుకలో ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ ఐ.వి రోహిత్ పాల్గొన్నారు. ప్రభుత్వం తరపున దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పట్టువస్త్రాలను సమర్పించారు. వైదిక కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి, ఇంద్రగంటి వెంకటేశ్వర్లు తదితరులు నిర్వహించారు. కల్యాణం అనంతరం 8 ప్రత్యేక కౌంటర్ల ద్వారా తలంబ్రాల అక్షింతల ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 150 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కలెక్టర్ నివాస్ కల్యాణ వేడుకలకు హాజరయ్యారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో 150 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



సాంస్కృతిక కార్యక్రమాలు





పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న చైర్మన్, ఈవో

సర్టిఫికెట్లు ఎప్పుడిస్తారో..?

కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలకు పాట్లు

నూతన విద్యాసంవత్సరం ఆరంభంలో ఇబ్బందులు

ఎన్నికల విధులతో ఆగిన సర్టిఫికెట్ల జారీ

పట్టించుకోని అధికారులు

రాజమహేంద్రవరం సిటీ, మే 19 : ఉన్నత విద్యకు అర్హత సాధించిన విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీలో చాలా జాప్యం జరుగుతోంది. ఎన్నికల కోడ్ అమలు ప్రారంభం నుంచి రెవెన్యూ శాఖ నుంచి జారీ కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు రాక విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో దాదాపు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాల అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నారు. దీంతో విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువీకరణ పత్రాలు జారీలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వేలాది మంది విద్యార్థులు వేచి చూస్తున్నారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయినా వెబ్‌సైట్‌లు ఓపెన్ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ధ్రువీకరణ పత్రాల అవసరం పెరిగింది. నూటికి 90 శాతం విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లోనే చదువుకునేందుకు ఉత్సాహం చూపు తున్నారు. ఆయా విద్యాసంస్థల్లో 80 శాతం పైబడి అడ్మిషన్లు అయిపోయాయి. ఆయా కాలేజీల్లో చేరేందుకు కుల, ఆదాయ , నివాస ధ్రువీకరణ పత్రాల అవసరం ఉంటుంది. దీంతో ఇప్పటికే విద్యార్థులు మీసేవ, సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. అయితే అధికారులు అందరు ఎన్నికల విధుల్లో ఉండడం వల్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయి ఐదు రోజులు కావడంతో దరఖాస్తులు చేసుకున్నవారు కార్యాలయాలకు వెళుతుంటే ఇంకా పూర్తి కాలేదనే సమాధానం వస్తోంది. జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌కు 16 రోజుల గడువు ఉన్నప్పటికి సర్టిఫికెట్స్ జారీలో జాప్యం తప్పడం లేదు. ఒక పక్క రోజులు గడుస్తున్నాయి.. కాలేజీల అడ్మిషన్లు వేగంగా అయిపోతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి , కలెక్టర్ డాక్టర్ మాధవీలత వెంటనే స్పందించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



సాత్విక్‌సాయిరాజ్‌కు అభినందనలు

అమలాపురం టౌన్, మే 19: థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 డబుల్స్ ఫైనల్స్‌లో రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్-చిరాగ్‌శెట్టి జోడీ విజయం సాధించింది. దీంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ జోడీకి పలువురు అభినందనలు తెలిపారు. సాత్విక్‌సాయిరాజ్ విజయ యాత్రలో మరో కప్ వచ్చి చేరిందని అభినందించారు. సాయిరాజ్-చిరాగ్‌శెట్టి జంటకు ఒలింపిక్ అసోసియేషన్ చీఫ్ అడ్వయిజర్ కుడుపూడి సూర్యనారాయణరావు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ మెట్ల వెంకటసూర్యనారాయణ, అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మెట్ల రమణబాబు, కార్యదర్శి గోకరకొండ నాగేంద్ర, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.

కారు అద్దాలు పగలకొట్టి బంగారం చోరీ



కొత్తపల్లి, మే 19: సాయంత్రం పూట చల్లగాలులను ఆస్వాదించేందుకు ఉప్పాడ బీచ్‌కు వచ్చిన పర్యాటకుల బంగారు అభరణాలు, నగదును దొంగిలించిన సంఘటన ఆలస్యంగా తెలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 12వ తేదీ సాయంత్రం కాకినాడ రూరల్ మండలం వలసపాకలకు చెందిన కె.శంకర్ తన కారులో కుటుంబసభ్యులతో ఉప్పాడ బీచ్‌కు వచ్చారు. సముద్రంలో స్నానాలు చేసేందుకు కుటుంబసభ్యుల బంగారు ఆభరణాలు బ్యాగ్‌లో పెట్టి కార్‌ను ఒక పక్కగా పార్క్ చేశారు. స్నానాలు చేసి తిరుగు ప్రయాణం అయ్యేందుకు కార్ దగ్గరకు రాగానే అప్పటికే కార్ వెనుక డోర్ అద్దం పగిలి ఉండడాన్ని గమనించిన శంకర్ లోపల బంగారు ఆభరణాలు జాగ్రత్త చేసిన బ్యాగ్ కనిపించకపోవడం, దానిలో ఉన్న సుమారు రూ 2.50లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ 3 వేల నగదు, సెల్‌ఫోన్‌లు, క్రెడిట్‌కార్డులు లేకపోవడాన్ని గుర్తించారు. వెంటనే అక్కడ చుట్టుపక్కల వారిని ఆరా తీయగా ఎవరికీ తెలియదని చెప్పడంతో శంకర్ కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు బీచ్‌రోడ్డులో విచారణ చేపట్టారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



ప్రత్తిపాడు, మే 19: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. స్థానిక నరేంద్రగిరి కొండ జంక్షన్ వద్ద రహదారిపై వెళుతున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. టీషర్ట్, జీన్ ఫ్యాంట్ శరీరంపై ఉంది. యువకుడు తెలుపు రంగుతో ఐదున్నర అడుగుల పొడవు ఉన్నాడని ఆచూకీ తెలిసిన వారు ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీకి నష్టం చేస్తే క్షమించేదిలేదు

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు

ప్రత్తిపాడు, మే19: టీడీపీలో ఉంటూ పార్టీకే నష్టం వాటిల్లే విధంగా వ్యవహరించే వారు ఎంతటి వారైనా పార్టీ ఉపేక్షించదని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. ప్రత్తిపాడు మండలం టీడీపీ నాయకులు ఆదివారం తేటగుంట తరలివెళ్లి మాజీ మంత్రి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడును కలిశారు. టీడీపీలో ఉంటూ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం పనిచేసిన మురళీరాజును వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, పార్టీ సభ్యత్వం రద్దు చేయించాలని టీడీపీ నాయకులు కోరారు. దీనికి మాజీ మంత్రి యనమల స్పందిస్తూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎవరైనా పార్టీ చర్యలు తీసుకోవడం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, మండల పార్టీ నాయకులు అమరాది వెంకట్రావు, పల్లా గోపి, బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, గొంతిన సురేష్, జింకల తాతారావు, మంతెన శ్రీను, లొండా లోవరాజు, రోమాల అప్పలరాజు, సింగిలి వెంకటేష్, తటవర్తి సుబ్బారావు, ఇళ్ళ అప్పారావు, పోలిశెట్టి శ్రీను, రావూరి తాతాజీ, చిలకమర్తి వీరభద్రం, పుణ్యమంతుల శ్రీను పాల్గొన్నారు.

వైభవంగా భావనారాయణస్వామి కల్యాణం



కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

సర్పవరం జంక్షన్, మే 19 : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి కల్యాణం వందలాది మంది భక్తుల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి వార్షిక దివ్య కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి వైశాఖమాసం శుద్ధ ఏకాదశి విశేష పర్వదినంలో భావనారాయణస్వామి కల్యాణాన్ని పూర్తి సంప్రదాయబద్ధంగా శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్ఛరణలతో వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం నిత్య పూజ హోమం, బలిహరణ సేవాకాల కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పెద శేష వాహనంపై తిరువీధి ఉత్సవం ఘనంగా జరిపారు. దివ్య కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ ఆవరణలో ఎదురు సన్నాహ కార్యక్రమం పూర్తి శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి కల్యాణం వైభవంగా జరిపారు. తలంబ్రాలు పోసుకునే దృశ్యాన్ని ఆద్యంతం భక్తులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కల్యాణాన్ని స్వయంగా వీక్షించేందుకు ఉమ్మడి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జె. భీమశంకరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం కలకలం



తుని రూరల్, మే 19: 16వ నెంబరు జాతీయ రహదారి ఆనుకుని తేటగుంట శివారు రాజుల కొత్తూరు వద్ద ఆదివారం వివస్త్రగా ఉన్న ఓ మహిళ మృతదేహం కనిపించడం తీవ్ర సంచలనం సృష్టించింది. స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు మహిళను చిత్రహింసకు గురిచేసి అత్యాచారం చేసి చంపి ఈ ప్రాంతంలో పడేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. సంఘటనా స్థలంలోని సమీప పరిసరాలు, హోటల్స్‌లో ఆరా తీస్తున్నారు. ఆర్. కొత్తూరు శివారు ఎర్రకోనేరు వద్ద మహిళ మృతదేహాన్ని తరలించేందుకు వినియోగించిన బెడ్‌షీడ్‌ను పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనకు సంబంధించి రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి వివరాలు వెల్లడించారు. హత్యకు గురైన మహిళ తుని ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో వ్యభిచారం చేస్తూ జీవనోపాధి పొందుతున్నట్లు తెలిపారు. తుని పట్టణంలో దిబ్బలపాలెంలో రాపర్తి అమ్ములు అనే ఆమెతో కలిసి ఉంటుందని ఆ ప్రాంతంలో ఆమెను కుమారిగా పిలుస్తారని తెలిసిందన్నారు. ఈ దారుణానికి పాల్పడిన కారకులను త్వరలోనే పట్టుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

తలుపులమ్మ లోవలో భక్తుల సందడి





తుని రూరల్, మే19: తూర్పు కనుమల్లో కొలువై భక్తుల ఆరాధ్య దైవంగా పూజలు అందుకుంటున్న తలుపులమ్మ వారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తల్లి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేకుమజామునే వేలాదిగా తరలివచ్చారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. లోవకు కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లోను, ఆరుబయట వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. తరలివచ్చిన వాహనాలతో లోవ ప్రాంగణంలో వాహనాల రద్దీ ఏర్పడింది. రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.3.69 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

కొవ్వూరు, మే 19: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా ఇద్దరు గాయపడినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. కొవ్వూరులోని ఇందిరమ్మకాలనీకి చెందిన కల్లి పూర్ణ సాయికార్తీక్ (21) తన స్నేహితులు కరగాని గణేష్, కురందాసు దుర్గలతో కలిసి బైక్‌పై కొవ్వూరు నుంచి దొమ్మేరు వైపు వెళ్తుండగా నందమూరు జగనన్న కాలనీ, కాపవరం గ్రామాల మధ్యలో ఎక్స్‌ప్రెస్ హైవే సర్వీస్ రోడ్‌లో అరటికాయల లోడ్‌తో వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికార్తీక్ అక్కడికక్కడే మృతి చెందగా గణేష్, దుర్గలకు తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.సుదాకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

గోదావరిలో మునిగి బాలుడి మృతి



ఆత్రేయపురం, మే 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ దిగువన గోదావరిలో స్నానం చేస్తూ బాలుడు మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శాంతినగర్‌కు చెందిన దడాల దినేష్ (15) ఆదివారం తన మిత్రులతో కలిసి బ్యారేజీ వద్దకు స్నానానికి వెళ్లాడు. సాయంత్రం సమయంలో బ్యారేజీ దిగువకు వెళ్లడంతో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్రేయపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం



రావులపాలెం, మే 19: రావులపాలెం గౌతమి గోదావరిలో శనివారం సరదాగా ఈత కోసం దిగి గల్లంతైన ముగ్గురిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమైన విష యం విదితమే. మూడో యువకుడైన సత్తి సంపతరెడ్డి (17) కోసం గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం తాతపూడి ఇసుక ర్యాంపు సమీపంలో మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు సీఐ ఎం.ఆంజనేయులు తెలిపారు.

ఏపీఈఏపీ సెట్‌కు 897 మంది హాజరు

జేఎన్టీయూకే, మే19: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 927 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 897 మంది హాజరయ్యారని, 30 మంది గైర్హాజరు కాగా 96.76 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అదే విధంగా తూర్పుగోదావరి జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షకు 715 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 704 మంది హాజరయ్యారని, 11 మంది పరీక్ష రాయలేదని మొత్తం 98.46 శాతం హాజరు నమోదైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 345 మంది హాజరు కావాల్సి ఉండగా 336 మంది హాజరయ్యారని 9 మంది గైర్హాజరయ్యారని మొత్తం 97.39 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలు ఆదివారం మధ్యాహ్నం సెషన్‌లో మాత్రమే జరిగాయని ఈ పరీక్షలు ఈ నెల 23 వరకూ కొనసాగుతాయన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

మన్యంలో పర్యాటకుల సందడి



తడికవాగు సమీపంలో సందడి చేస్తున్న పర్యాటకులు

మోతుగూడెం, మే 19: పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో విహారయాత్రలకు పర్యాటకులు తరలివస్తున్నారు. పొల్లూరు జలపాతం, సీలేరు నది, పిక్నిక్‌స్పాట్, పవర్ ప్లాంట్, ఫోర్ బై డ్యాం, తడికవాగు, డొంకరాయి రిజర్వాయర్, పుష్ప బ్రిడ్జి వద్ద సందడి వాతావరణం నెలకొంది. పొల్లూరు జలపాతానికి ఆదివారం నుంచి పర్యాటకుల రాక ప్రారంభమైంది. హోటల్స్, వ్యాపార సముదాయాల వద్ద రద్దీ నెలకొంది.

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణం



ఎటపాక, మే 19: ఎటపాక మండలం తోటపల్లి, చోడవరం గ్రామాల్లో వేంచేసి ఉన్న శ్రీ రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణం సందర్భంగా ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న సమయంలో వేదికపై స్వామివారిని, అమ్మవార్లను ఆశీనులను చేసి శాస్త్రోక్తంగా కల్యాణ తంతును జరిపించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు హాజరై కల్యాణాన్ని వీక్షించారు. అర్చకులు గొట్టుపుళ్ల చెన్నకృష్ణమాచార్యులు, బండారు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

వై.రామవరం, మే 19: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో మిగిలి ఉన్న ఖాళీలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏకలవ్య పాఠశాలల కన్వీనర్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు. ఈ సంవత్సరం సీబీఎస్ఈ టెన్త్, ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థుల నుంచి ఐటీడీఏ పీవో ఆదేశాలననుసరించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 110 సీట్లకు ఈఎంఆర్ఎస్ పి.యర్రగొండలో బాలికలు 13, మారేడుమిల్లి ఏకవల్య పాఠశాలలో బాలికలు 18, బాలురు 16, రాజవొమ్మంగిలో బాలికలు 15, బాలురు 16, చింతూరులో బాలికలు 16, బాలురకు 16 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు.

'లూజ్ పెట్రోల్ విక్రయించొద్దు'

దేవీపట్నం, మే 19: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బాటిళ్లు, కంటైనర్లలో, ఇతర ఏ పద్ధతుల్లో లూజ్ పెట్రోల్ విక్రయించొద్దని పెట్రోల్ బంక్ యజమానులను దేవీపట్నం ఎస్ఐ కె.వి నాగార్జున ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లూజ్ పెట్రోల్ విక్రయించకుండా నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘించి నిబంధనలకు విరుద్ధంగా లూజ్ పెట్రోల్ విక్రయించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోశమ్మగండికి భక్తుల తాకిడి

దేవీపట్నం, మే 19: మండల పరిధిలో వేంచేసి ఉన్న మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. వేకువజామునే పుణ్యస్నానాలాచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయానికి సంబంధించి టిక్కెట్లు తదితర వాటి ద్వారా రూ.34,400 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పాపికొండలకు ఏడు బోట్లు

దేవీపట్నం, మే 19: పాపికొండలు అందాలు తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు విహారయాత్రకు వచ్చారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వచ్చిన సుమారు 500 మంది పర్యాటకులు ఏడు బోట్లలో పోశమ్మ గండి బోటు పాయింట్ నుంచి గోదావరి పరివాహక ప్రాంతాల మీదుగా పాపికొండలు వెళ్లి అందాలు తిలకించారు.


విభిన్న వాతావరణం



నిర్మానుష్యంగా ఉన్న రహదారి

మోతుగూడెం, మే 19: చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో ఆదివారం విభిన్నమైన వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చాటాడు. దీంతో జనం బయటకు వచ్చేందుకు భయపడగా వాహన రాకపోకలు సైతం నిలిచిపోయి నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం 4 గంటల తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీ వర్షం కురిసింది. ఏజెన్సీ వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

ఆకాశం 'గులాబీ'మయం



కూనవరం, మే19: శబరి-గోదావరి సంగమం సూర్యుని కిరణాలతో ఆహ్లాదంగా మారింది. గోదావరి-శబరి సంగమం నీళ్లన్ని గులాబీ వర్ణంలో కనిపించాయి. ఆదివారం సాయంత్రం ఈ ప్రాంతానికి వచ్చిన పర్యాటకులను కనువిందు చేశాయి. అటువైపుగా వెళ్లేవారు ఈ సుందర దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధించారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు

నిడదవోలు, మే 19: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోటస త్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్ర నామ కుంకుమ పూజలు, క్షీర నివేదన, మహానివేదన చేశారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ఆలయానికి పలు జిల్లాల నుంచి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్ల ద్వారా రూ.1,74,097 ఆదాయం లభించినట్టు ఈవో సూర్యప్రకాష్ తెలిపారు.

ఇసుక లోడింగ్‌కు యంత్రాలు వద్దు



కుమారదేవంలో ఇసుక తవ్వకాల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

- లోడింగ్‌కు యంత్రాలు వినియోగిస్తే సీజ్ చేస్తాం
- వంతెనలకు 500 మీటర్ల లోపు ఇసుక తవ్వకాలు నిషేధం
- అనుమతి పొందిన వారే డ్రెడ్జింగ్ చేయాలి
- కలెక్టర్ మాధవీలత.. పలు ఇసుక ర్యాంపులు తనిఖీ

కొవ్వూరు/తాళ్లపూడి/కడియం, మే 19: గోదావరి నదిపై ఉన్న వంతెనలకు 500 మీటర్ల లోపు ఎటువంటి ఇసుక తవ్వకాలు చేపట్టరాదని, నిబంధనలు అతిక్రమించి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత హెచ్చరించారు. ఆదివారం కొవ్వూరు మండలం కుమారదేవం, చిడిపి, తాళ్లపూడి మండలం బల్లిపాడు, కడియం మండలం వేమగిరి గ్రామాల్లోని ఇసుక ర్యాంపులను అధికారులతో కలిసి ఆమె తనిఖీ చేశారు. గోదావరి నదిలో ఇసుక తవ్వకాలకు సంబంధించి ఓపెన్ రీచెస్, బోట్స్‌మేన్ సొసైటీలు, డ్రెడ్జింగ్ తవ్వకాలపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ ఇసుకర్యాంపులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు టెండర్లు పిలిచి 3 కిలోమీటర్ల నుంచి 12 కిలోమీటర్ల వరకు ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చారన్నారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నారన్నారు. హైకోర్టు ఆదేశాలమేరకు క్షేత్రస్థాయి పర్యటన చేపట్టామన్నారు. ఓపెన్ రీచ్‌లలో గోదావరి నది ప్రాంతంలో వాహనాలను వినియోగించరాదన్నారు. లోడింగ్‌కు టిప్పర్లు, ప్రొక్లెయినర్‌లు వినియోగిస్తున్నారని వాటిని సీజ్ చేస్తామన్నారు. బోట్స్‌మేన్ సొసైటీల వారు డ్రెడ్జింగ్ చేస్తున్నారని, అనుమతి పొందిన వారు మాత్రమే డ్రెడ్జింగ్ చేయాలన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద వాహనాలతో లోడింగ్ చేసుకోవచ్చునన్నారు. ర్యాంపుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి హైకోర్టుకు నివేదిక అందజేస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, డీఎస్పీ కేసీహెచ్ రామారావు, ఏజీఆర్‌టీ ఏఈ ఆర్.సునీల్‌బాబు, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సోమశేఖర్, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం, గ్రౌండ్‌వాటర్ డీడీ వై శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, ఇరిగేషన్ అధికారి ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, పెరవలి తహశీల్దార్ సుధ తదితరులున్నారు.



కొవ్వూరు: కుమారదేవంలో ఇసుకర్యాంపును తనిఖీచేస్తున్న కలెక్టర్



తాళ్లపూడి: బల్లిపాడులో ఇసుక ర్యాంప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కోనసీమ పరిధిలో ఇసుక తవ్వకాలు!

'రెవెన్యూ, మైనింగ్ అధికారులు తప్పించుకునే ఎత్తుగడ'

పెరవలి, మే 19: ఇసుక అక్రమ తవ్వకాలపై ఆంధ్రజ్యోతిలో ఇటీవల వరుసగా కథనాలపై జిల్లా కలెక్టర్ మాధవీలత స్పందించారు. ఈ మేరకు అక్రమ ఇసుక తవ్వకాలు జరిపినట్లు ఆరోపణలు వచ్చిన ర్యాంప్‌లను ఆదివారం ఆమె పరిశీలించారు. జిల్లాలో పలు ర్యాంప్‌లతో పాటు తీపర్రు ర్యాంప్‌ను కూడా పరిశీలించారు.ఇక్కడ అనుమతి పొందిన వారు అక్రమంగా తమకు అనుమతించిన దానికంటే ఎక్కువ మొత్తంలో అక్రమ తవ్వకాలు జరిపినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇసుక అక్రమాలు జరిపిన గోదావరి ప్రాంతంలో నాలుగు రోజుల కిందట మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు పర్యటించి వివరాలు నమోదు చేశారు. అయితే ఆ సమయానికి అంత వరకు జరిపిన తవ్వకాలు ఆపి వేసి తవ్వకందారులు పరారవ్వడం, ఎటువంటి ఆనవాళ్లు లేకుండా అదే రోజు రాత్రి గండికొట్టి నీటిని వదిలి వేయడంతో ఆ ప్రదేశమంతా నీటితో నిండిపోయింది. దీంతో అక్రమ తవ్వకాలు నిగ్గు తేల్చేందుకు ప్రస్తుతం అధికారులకు అవకాశం లేకుండాపోయింది. అయితే ఇక్కడకు వచ్చిన కలెక్టర్ మాధవీలతకు.. స్థానిక రెవెన్యూ, మైనింగ్ అధికారులు చెప్పిన ప్రకారం ఈ ప్రాంతంలో తవ్వకాలు జరిగిన ప్రాంతం కోనసీమలోకి వస్తుందని, ఆ జిల్లా అధికారులు ఇక్కడ పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దీంతో జిల్లా అధికారులు తమ బాధ్యతలు నుంచి తప్పించుకోవడానికి ఇదొక ఎత్తుగడగా స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ప్రతిమ కంపెనీకి అనుమతులు ఇచ్చినట్టు చెబుతున్నారు. అయితే అదే కంపెనీ ఇచ్చిన పరిధి కంటే కోనసీమ పరిధిలో కూడా తవ్వకాలు జరిగినట్టు చెబుతున్న అధికారులు అదే అంశాన్ని పరిగణలోకి తీసుకుని కేసులు న మోదు చేయాలి కదా అని ప్రశ్నిస్తున్నారు. తవ్వకందారులపై చర్యలు తీసుకోవాలంటే తూర్పుగోదావరి జిల్లా, కోనసీమ జిల్లా రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా బ్యారేజీ వద్ద నీరు రాకుండా అడ్డుకట్ట వేసి అక్రమాలు నిగ్గు తేల్చవచ్చునని, అలా కాకుండా బాధ్యతల నుంచి తప్పించుకోవడం,అక్రమార్కులకు మేలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసువ తవ్వకాలకు యంత్రాలను వినియోగించుకూడదని కలెక్టర్ చెబుతుఅన్నరని, అయితే యంత్రాలు ఉపయోగించి మూడు నెలలుగా భారీ ఎత్తున తవ్వకాలు జరిపి కోట్లాది రూపాయలు కూడబెట్టుకున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



అనపర్తిలో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

బిక్కవోలు, మే 19: మండలంలో పలు చోట్ల శ్రీనివాసుని కల్యాణాలు ఘనంగా నిర్వహించారు. కొమరిపాలెంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడి కల్యాణం సందర్భంగా ఆదివారం అనపర్తి కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈయన వెంట రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి, డీవీఆర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బిక్కవోలు పార్కు వీధిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు.

అనపర్తి: అనపర్తిలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. వైష్ణవ సాంప్రదాయంలో నిర్వహించిన ఈ కార్యక్రమలో వేద పండితుడు పెద్దింటి వేణుగోపాలాచారి పర్యవేక్షణలో ఆలయార్చకుడు కామేశ్వరశర్మ దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. అలాగే స్థానిక కెనాల్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

20 వేల మెజార్టీతో గెలుస్తా : నల్లమిల్లి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, మే 19: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాను అనపర్తి నుంచి 20 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తానని కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన బిక్కవోలులో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తన అభ్యర్థిత్వం గందరగోళంలో పడిన నాటి నుంచి పోలింగ్ ముగిసే వరకూ సైనికుల్లా పనిచేసిన కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీలో యువత ఎక్కువగా చేరారని వీరికి సీనియర్లందరూ దిశానిర్దేశం చేసి ఇకపై టీమ్‌గా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో కనీసం 145 సీట్లతో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టబోతున్నారని ఆయన అన్నారు. సమావేశంలో పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, సింగారపు రామారావు, రాయుడు రామచంద్రరావు, చాగంటి సాయిబాబారెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, జంపా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తాడేలమ్మ తీర్థ మహోత్సవాలు



దివాన్‌చెరువు, మే 19: పాలచర్లలో శ్రీ తాడేలమ్మ తీర్థ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటి రోజైన ఆదివారం అమ్మవారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద బాణసంచా కాల్పులు, గరగ నృత్యాలు, డప్పువాయిద్యాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాలు సందర్భంగా అమ్మవారికి రాజమహేంద్రవరానికి చెందిన భక్తుడు జామిఆదిశేఖర్ రూ.25 వేలు విలువైన వెండిపాదుకలు (శఠగోపం), కూరాకుల తాతారావు రూ.20 వేల వ్యయంతో ఇత్తడి మకర తోరణాన్ని అందజేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఐదో రోజు అన్నసమారధన జరుగుతుందన్నారు. కాగా ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పువ్వులు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

ఓటమి ఆలోచన జీర్ణించుకోలేకపోతున్న వైసీపీ

టీడీపీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి



రాజమహేంద్రవరం సిటీ, మే 19: రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలవుతుందని చెబుతున్న సర్వేలను చూసి ఓటమి ఆలోచననే జీర్ణించుకోలేకపోతోందని టీడీపీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. ఈ నెల 13న జరిగిన పోలింగ్ సరళి చూస్తే అర్థమవుతుందని రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధిస్తుందన్నారు. రాజమహేంద్రవరంలో ఆది రెడ్డి శ్రీనివాస్ విజయం సాధిస్తారని, చంద్రబాబు సీఎం కావడం ఖాయమన్నారు.

కాల్షియం కార్బైడ్ ప్రమాదకరం

డీసీపీసీ సభ్యుడు అనంతరావు



రాజమహేంద్రవరం సిటీ, మే19: జిల్లాలో కొంత మంది వ్యాపారులు మామిడి పండ్లను కావు వేసి ముగ్గించకుండా కాల్షియం కార్బైడ్‌తో పం డిస్తున్నారని ఇది చాలా ప్రమాదకరమని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు అన్నారు. రాజమహేంద్రవరం వినియోగదారుల వాయిస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కాల్షియం కార్బైడ్ వల్ల మనిషి ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. దీనిపై చర్యలు చేపట్టాలని ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు ఇటీవల అన్ని రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేపట్టాలన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలు



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న స్కూల్ చైర్‌పర్సన్ విజయ

రాజమహేంద్రవరం కల్చరల్ మే 19: కవలగొయ్యి గ్రామంలోని ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూలులో ఏపీ స్టేట్ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ శనివారం నిర్వహించారు. తూర్పుగోదావరి చెస్ అసోసియేషన్ ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 300మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలను స్కూల్ చైర్‌పర్సన్ యేలేటి విజయ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్ యేలేటి రవిబాబు, సీఈవో రుద్రశ్రీ మహస్వి, ప్రధానోపాధ్యాయుడు ఎం.శేషగిరిధర్, డీన్ హర్షిణి, వైస్ ప్రిన్సిపాల్స్ సైదా, శ్రీవల్లి, ఆంధ్రా చెస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మాదాస్ కిషోర్ పాల్గొన్నారు.

జానా సత్యనారాయణ సేవలు ఆదర్శనీయం



సత్యనారాయణను సత్కరిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్, మే 19: విలేజ్ డెవలప్‌మెంట్ అధికారి దగ్గర నుంచి అంచెలంచెలుగా ఎదిగి డీఎల్‌పీవో, డీజీపీవోగా అంకితభావంతో విధులు నిర్వహించిన జానా సత్యనారాయణ సేవలు అభినందనీయమని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి దాసరి రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని బొమ్మూరులో చెరుకూరి కన్వెన్షన్ హాల్‌లో జానా సత్యనారాయణ పదవీవిరమణ ఆత్మీయ సమావేశం ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘం, ఏపీ పంచాయతీ విస్తరణాధికారుల సంఘం ఆధ్వర్యంలో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాంబాబు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా తొలి జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా ఎనలేని సేవలందించారన్నారు. ఈ సందర్భంగా ఆయనను డీజీపీవో, డీఎల్‌పీవోలు, పంచాయతీ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు.

బి-ఆర్క్, ప్లాన్ ఫలితాల్లో 'తిరుమల' ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్ , మే 19: కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జేఈఈ(మెయిన్) బి-ఆర్క్, బి-ప్లాన్ ఫలితాల్లో కాతేరులోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. బి-ప్లానింగ్ విభాగంలో ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయిలో కె.సాకేత్ ప్రణవ్ 1వ ర్యాంకు సాధించడంతోపాటు వివిధ కేటగిరీల్లో కేజే వెంకటసాయి 2వ ర్యాంకు, పప్పుల దినేష్ 8వ ర్యాంకు, జి.వెంకటసాయికృష్ణ 18వ ర్యాంకు, ఎన్.రాజీవ్ 20వ ర్యాంకు సాధించారన్నారు. దీంతోపాటు 23, 24, 25, 26, 31, 36, 40,44, 50 ర్యాంకులు సాధించారన్నారు. బీఆర్క్ విభాగంలో వివిత కేటగిరీల్లో జాతీయ స్థాయిలో తాటిపాక ఆదిత్య 4వ ర్యాంకు, కె.సాకేత్ ప్రణవ్ 5వ ర్యాంకు, కేజీ వెంకటసాయి 5వ ర్యాకు, పప్పుల దినేష్ 14వ ర్యాంకు, జీఎస్ వెంకటదుర్గసాయి 17వ ర్యాంకు సాధించడంతోపాటు 21, 27, 35, 36, 40, 43 ర్యాంకులు సాధించారన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్‌తో కలిసి తిరుమలరావు అభినందించారు.


దివాన్‌చెరువులో ఉచిత వేసవి క్రీడా శిక్షణ



కబడ్డీ ఆడుతున్న శిక్షణా క్రీడాకారులు

దివాన్‌చెరువు, మే 19: వాసు రేంజర్స్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో దివాన్‌చెరువులో వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు క్లబ్ సభ్యులు తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఈ శిబిరంలో ఖోఖో, కబడ్డీ క్రీడలకు నిపుణులతో శిక్షణ ఇస్తున్నారన్నారు. సుమారు 40 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారని, మరి కొందరు ఒకటిరెండు రోజుల్లో వస్తారన్నారు. జూన్ 10వ తేదీ వరకూ ఈ శిక్షణ కొనసాగుతుందని, ప్రవేశం పొందేందుకు ఆసక్తి ఉన్న వారు 92955 52543 నెంబరులో సంప్రదించాలని కోరారు.

లారెల్ హైగ్లోబల్ స్కూల్ విద్యార్థికి ర్యాంకు



రాజమహేంద్రవరం కల్చరల్, మే 19 : రాజమహేంద్రవరం లారెల్ హై గ్లోబల్ స్కూల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థి నూజిళ్ల యశస్వి ఎన్‌టీఏ పరీక్షలో అఖిల భారత స్థాయిలో 562 ర్యాంక్ సాధించాడు. ఈ మేరకు ఆదివారం డైరెక్టర్ రవికుమార్ సుంకర, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి గురునాథ్ అభినందించారు.

వ్యాయామంతో మధుమేహం నియంత్రణ

నిడదవోలు, మే 19: ఆహార నియమాలతో పాటు క్రమం తప్పకుండా వ్యా యామం మందులు వాడకం ద్వారా మధుమేహ వ్యాధిని నియంత్రణలో ఉంచు కోవచ్చని సిరి ఎమర్జెన్సీస్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సిద్ధార్థ కన్నాజీ అన్నారు. ఆదివారం నిడదవోలులోని గాంధీనగర్‌లో నిర్వహించిన వాకర్స్‌క్లబ్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యా యామానికి సమయం కేటాయించాలని, జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యా న్ని పరిరక్షించుకోవచ్చని అన్నారు.

బాటిళ్లలో డీజిల్, పెట్రోల్ విక్రయించొద్దు

గోకవరం, మే19: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం జరుగుతున్న ఘర్షణలు, అల్లర్లు, పలు హింసాత్మక సంఘటనల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు పలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా పెట్రోల్ బంక్‌ల్లో బాటిళ్లు, టిన్‌లలో పెట్రోల్, డీజిల్ విక్రయించొద్దని ఎస్ఐ కె.నాగరాజు ఆదివారం బంకు యాజమానులకు సూచించారు. ఆదేశాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లోని చిల్లర దుకాణాల వద్ద పెట్రోల్, డీజిల్ విక్రయాలు జరపరాదన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు బాణసంచా తయారీ, విక్రయాలను కూడా నిలిపివేయాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాగరాజు హెచ్చరించారు.

చింతాలమ్మ జాతర



కడియం, మే 19: వీరవరం గ్రామదేవత చింతాలమ్మ జాతర, తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం రాత్రి అమ్మవారి జాతర, ఆదివారం తీర్థమహోత్సవం నిర్వహించారు. గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు చింతాలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. కాగా అమ్మవారు గరగల రూపంలో గ్రామంలో తిప్పే సమయంలో గ్రామ ఆడబడుచు ఎవరూ ఊరి దాటి వెళ్లకపోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. గ్రామ ఆడబడుచు ఏదైనా ఊరు వెళ్లాలన్నా, పుట్టింటి నుంచి మెట్టింటికి వెళ్లాలన్నా తీర్థం అయిన తరువాతే చేస్తారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	ఆ ఒక్కటీ అడక్కు
సూర్యామినీ	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
సూర్యాప్యాలస్	అపరిచితుడు
స్వామి	కృష్ణమ్మ
శివజ్యోతి	గీతాంజలి మళ్లీ వచ్చింది
అనుశ్రీ(సాయికృష్ణ)	ది గ్యారీ ఫీల్డ్ మూవీ
రాజా	రత్నం
ఊర్వశి	బాక్
రంభ	మిరల్
మేనక	నటరత్నాలు, ప్రసన్నవదనం
అప్సర	కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
కుమారి	దర్శిని, రత్నం
వీఎస్ మహల్(నామవరం)	కృష్ణమ్మ
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	అపరిచితుడు
వెంకటసూర్య(కడియం)	ఆ ఒక్కటీ అడక్కు
సత్యగౌరి (అనపర్తి)	బాక్
సూర్యశ్రీ (అనపర్తి)	ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	బాక్
రామకృష్ణ(కోరుకొండ)	
గీతాసినిమాస్ (సీతానగరం)	
శ్రీనివాస (గోకవరం)	కృష్ణమ్మ
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
లలితామహల్(రంపచోడవరం)	ఆ ఒక్కటీ అడక్కు
నవయుగ(చింతూరు)	ఆ ఒక్కటీ అడక్కు

మండలాల వారీ కొనుగోళ్లు ఇలా..



ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లు అంతంతమాత్రంగానే జరిగాయి. అయినా నేటి వరకూ సొమ్ములు మాత్రం అందలేదు. అనపర్తి మండలంలో 702.24 మెట్రిక్ టన్నులు, బిక్కవోలులో 1047.48 టన్నులు, చాగల్లులో 23,724.4 టన్నులు, దేవరపల్లిలో 11,312.4 టన్నులు, గోకవరంలో 498.04 టన్నులు కొనుగోలు చేశారు. గోపాలపురంలో 4,041.56 టన్నులు,కడియంలో 11,731 టన్నులు, కోరుకొండలో 973.64 టన్నులు, కొవ్వూరులో 2786.24 టన్నులు, నల్లజర్లలో 5895.16 టన్నులు, నిడదవోలులో 46673.04 టన్నులు, పెరవలిలో 21136 .56 టన్నులు, రాజమ హేంద్రవరం రూరల్‌లో 1260 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. రాజానగరంలో 8868 .52 టన్నులు, రంగంపేటలో 498.52 టన్నులు, సీతానగరంలో 6620.08 టన్నులు, తాళ్లపూడిలో 16,163 మెట్రిక్ టన్నులు ఉండ్రాజవరంలో 37,106.76 టన్నులు కొనుగోలు చేశారు. మొత్తం జిల్లాలో 225539.6 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా పలుమండలాల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయి.



వర్షంలోనే బుర్రిలంక, తీపర్రు ర్యాంపులు పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

జిల్లా అధికారుల ఉరుకులు.. పరుగులు

- జూలై 15 వరకు నివేదిక ఇవ్వాలన్న సుప్రీం
- ర్యాంపులను పరిశీలించిన జిల్లా అధికారులు
- అంతా సక్రమంగానే ఉందన్న కలెక్టర్
- నేడు సుప్రీం కోర్టుకు నివేదిక..17 ర్యాంపుల మూత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వంతెనల పక్కన ఎక్కడా ఇసుక తవ్వకాలు జరగడంలేదు.. ఇరిగేషన్ శాఖ ఇచ్చిన అనుమతుల మేరకే ఇసుక తవ్వకాలు సాగుతున్నాయంటూ జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. ఇసుక తవ్వకాల నేపథ్యంలో ఓపెన్‌రీచ్‌లు, బోట్స్‌మన్ సొసైటీ, డ్రెడ్జింగ్ పనులపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులతో కలిసి ఎట్టకేలకు ఇసుక ర్యాంపులను జిల్లా అధికారులు తనిఖీ చేశారు.కడియం మండలం బుర్రిలంక- వేమగిరి ఓపెన్ రీచ్, పెరవలి మండలం తీపర్రు- ఉసులుమర్రు, పెండ్యాల -కానూరు, నిడదవోలు మండలం పందలపర్రు, కొవ్వూరు మండలం లోని కుమారదేవం-చిడిపి, తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం, బల్లిపాడు ర్యాంపులను పరిశీలించారు.. గోదావరి నదీ ప్రాంతంలో ఇరిగేషన్ అధికారుల అనుమతితోనే తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ఇరిగేషన్ అధికారులు బ్యారేజికి 3 కిలోమీటర్ల పరిధి 12 కిలోమీటర్ల వరకూ అనుమతులు మంజూరు చేశారన్నారు. ఎవరూ కూడా వంతెనలకు 500 మీటర్ల పరిధిలో తవ్వకాలు చేయడం లేదని స్పష్టం చేశారు. అధికారులు ప్రతి రోజూ పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ఓపెన్ రీచ్‌ల వద్ద గోదావరి నది ప్రాంతంలో వాహనాలు, యంత్రాలు వాడకూడదనేది అమలులో ఉందన్నారు. కానీ ట్రిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు ఉపయోగిస్తున్నట్టు తమ దృష్టికి రావ డంతో ఇప్పటికే వాటిని సీజ్ చేసినట్టు చెప్పారు. బోట్స్‌మన్ సొసైటీలు డ్రెడ్జింగ్ చేయకూడదని, కానీ డ్రెడ్జింగ్ అనుమతి పొందిన వారు చేసుకోవ చ్చన్నారు. ఇసుక డంపింగ్ చేసిన ప్రాంతాల్లో బోట్స్‌మన్ సొసైటీల ద్వారా అమ్మకాలు చేసుకుని, వాహనాల ద్వారా రవాణా చేసుకోవచ్చన్నారు. ఓపెన్ రీచ్‌ల నిర్వాహకులకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, జేసీ ఎన్.తేజ్‌భరత్, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, కొవ్వూరు సబ్- కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, మైన్స్ ఏడీ ఎం. సుబ్రహ్మణ్యం, సెబ్ అధికారి వి.సోమశేఖర్, గ్రౌండ్‌వాటర్ డీడీ వై.శ్రీనివాస్, ఇరిగేషన్ హెడ్‌వర్క్స ఈఈ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు తనిఖీల్లో పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలతో కదలిక..

ఇసుక ర్యాంపులపై సుప్రీం కోర్టు జూలై 15న తీర్పు చెప్పే వరకూ ప్రతి సోమవారం నివేదిక ఇవ్వాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇంత వరకూ అక్రమాలను పట్టించుకోని అధికారులు ఆదివారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ర్యాంపులను పరిశీలించారు. గోదావరి బ్యారేజి నుంచి నీరు వదలడం.. వర్షం కారణంగా బ్యారేజీ కింది ర్యాంపులన్నీ ఇప్పటికే మూతపడ్డాయి. ఒక సీతానగరం మినహా మిగతా ప్రాంతాల్లో సుమారు 17 ర్యాంపులు మూత పడ్డాయి.ఆయా ర్యాంపులను ఆదివారం పరిశీలించారు. దీంతో గోతులు తప్ప.. యంత్రాలతో తవ్వే దృశ్యాలేమీ కానరాలేదు. సీతానగరంలో ఇంకా ఓపెన్ ర్యాంపుల్లో ఇసుక తీసేస్తున్నారు. వీటిని మరొక రోజు పరిశీలించనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ర్యాంపులపై సోమవారం సుప్రీంకోర్టుకు నివేదిక ఇవ్వనున్నారు.

కళ్లుండీ చూడలేకపోతున్న అధికారులు..

అధికారులు కళ్లుండీ చూడలేక పోతున్నారు.. చెవులుండీ వినలేకపోతున్నారు.. ఒక పక్కన అక్రమంగా ఇసుక తవ్వేస్తున్నా అధికారులు కాదని వాదించడం కొసమెరుపు.. జిల్లా అధికారులే అక్రమార్కులకు వంత పాడు తుంటే ఇంకేం చేయాలనేది పర్యావరణ ప్రేమికుల ఆందోళన. కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం పర్యటించినా అఖండ గోదావరిలో డ్రెడ్జింగ్ మాత్రం ఆగలేదు.కొవ్వూరు బ్రిడ్జి పక్కనే యంత్రాలతో ఎగుమ తులు సాగుతున్నాయి. ఒక కాంట్రాక్టు సంస్థ డ్రెడ్జింగ్ అనుమతి పొందిన సంగతి నిజమే. కానీ నిబంధనలు పాటించ డంలేదు ఇక్కడ పెద్ద యంత్రా లు లేవు. ఓ మోస్తరు డ్రెడ్జింగ్ మిషన్లు తెచ్చి ఇష్టానుసారం నదీ గర్భంలోని ఇసుక తోడేస్తున్నారు. దానిని ఒడ్డుకు తరలించి, అమ్మేస్తున్నా రు.దీనికి లెక్కా పత్రం లేదు. కాతేరులో బోట్స్‌మన్ సొసైటీలు కూడా డ్రెడ్జింగ్ బోట్లతో ఇసుక తోడేస్తున్నా కనీసం అధికారులు పట్టించుకోలేదు.



చివరికి.. చింతేగా!

అష్టకష్టాలు పడి అప్పులు చేసి మరీ పంటలు పండించిన అన్నదాతకు చివరికి మిగిలేది కష్టమే.. ధాన్యం అమ్మినా సొమ్ము చేతికి అందక.. చేసిన అప్పులు తీరక రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఏం చేయాలో దిక్కుతోచక చూస్తున్నారు.
గత ఐదేళ్లుగా ఏం జరిగిందో ఈ సారి అదే జరిగింది. జూన్ నెల వచ్చేస్తున్నా రబీ ధాన్యం కొను గోళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొన్న ధాన్యానికి పూర్తిగా సొమ్ములు చెల్లించలేదు. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. మరొక పక్క ఖరీఫ్ సాగు దగ్గరపడింది.. ఈ నేపథ్యంలో దిక్కుతోచక తలలు పట్టుకుంటు న్నారు. ఇంకో పక్క నాలుగు రోజులు వర్షాలనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రోడ్డుపై ఉంచిన ధాన్యం చూసి అన్నదాత ఆందోళన చెందుతున్నాడు.

- అన్నదాతకు మిగిలేది కష్టమే..
- ఈ ఏడాది లక్ష్యం 3.2 లక్షల మెట్రిక్ టన్నులు
- కొనుగోళ్లు 2.25 లక్షల మెట్రిక్ టన్నులే
- ఇంకా రైతులకు రూ. 225 కోట్లు బకాయి
- సకాలంలో సొమ్ములందక ఇక్కట్లు
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- ఖరీఫ్ సాగుపై నెలకొన్న ఆందోళన

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అన్నదాత ఆందోళన చెందుతున్నాడు..ఏ ఏడాది చూసినా అన్నదాతకు చివరికి మిగిలేది కష్టమే. ప్రభుత్వ చర్యలతో గత ఐదేళ్లు ప్రతి సంవత్సరం కష్టాలు పెరుగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది అదే జరిగింది. జిల్లాలో 59,348 హెక్టార్లలో వరి ఆయకట్టు ఉంది. ఈ సారి 55,315 హెక్టార్లలోనే రబీ సాగు చేశారు. ఇప్పటికే 54,853 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. అమ్మకానికి 1372 టన్నుల ధాన్యం సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్నారు. జిల్లాలో మొత్తంగా సుమారు 5.5 లక్షల మెట్రి క్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. అయితే పౌర సరఫరాల సంస్థ ద్వారా ప్రభుత్వం 3.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.మిగిలిన ధాన్యం స్థానికంగా అమ్ముకోవాల్సిందే. కొంత మంది రైతులు మిల్లర్లు, కమీషన్‌దార్లకు విక్రయించేశారు. ప్రభుత్వం ఇప్పటి వరకూ 2,25,337.88 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. దాని విలువ రూ.491.71 కోట్లు. రైతులకు రూ.277.84 కోట్లు మాత్రమే జమచేశారు. ఎన్నికలకు వారం రోజుల ముందు వరకూ ధాన్యం సొమ్ము జమ చేశారు. తర్వాత పట్టించుకోలేదు. ఇంకా సుమారు రూ.225 కోట్లు పెండింగ్ ఉంది. ఎన్నికలయ్యాయి. కొనుగోళ్లు మందగించాయి. అయినా పట్టించుకునే నాథుడు లేదు. ఇంకా రైతుల నుంచి ప్రభుత్వం సుమారు లక్ష టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఇదంతా ఎప్పుడు జరుగుతుందో మరి. రైతులు ఏరువాక సాగేదెలా అని ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం కంటే..దళారులే బెటర్

గోకవరం,మే 19 : గోకవరం మండలంలో ఈ ఏడాది 1535 హెక్టార్లలో వరి సాగు చేశారు. పండిన పంటను కొంతమంది రైతులు ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వానికి విక్రయించారు. ఇప్పటి వరకు రైతుల నుంచి ప్రభుత్వం 498.040 మెట్రిక్ టన్నుల దాన్యాన్ని సేకరించింది. రైతులకు రూ.1.08 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.79.84 లక్షలు మాత్రమే చెల్లించింది. ఇంకా రూ. 28.87 లక్షలు రైతులకు ప్రభుత్వం బకాయి ఉంది. రెండు మూడు రోజుల్లో రైతులకు బకాయి ఉన్న మొత్తాన్ని చెల్లిస్తామని అధికారులు చెప్పుకొస్తున్నారు. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర కంటే బయట మార్కెట్‌లోనే ధాన్యాన్ని మరింత ఎక్కువకు కొనుగోలు చేస్తున్నారంటూ చాలా మంది రైతులు దళారులను ఆశ్రయి స్తున్నారు. రబీ చాలా వరకు బయట విక్రయించేందుకే మొగ్గు చూపారు.

రబీ సొమ్ములు అందలేదు..

గోపాలపురం, మే 19 : రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాదు, ఒక వేళ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం అమ్మితే సమయానికి సొమ్ములు చేతికిరావు. ఇది వరి రైతుల పరిస్థితి. గోపాలపురం మండలంలో ఈ ఏడాది రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 360 మంది రైతుల నుంచి 4041 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రూ.8.82 కోట్లు జమ చేశారు. పంట కాలం పూర్తయినా నేటికి 14 మంది రైతులకు సంబంధించిన సొమ్ము రూ.20 లక్షలు వారి ఖాతాలో జమ కాలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సిద్ధమవడంపై ఆందోళన చెందుతున్నారు.

చంద్రబాబు హయాంలోనే బెటర్..



గత కొన్నేళ్లుగా వరి సాగు చేస్తున్నా. చంద్రబాబు హయాంలో 21వ రోజుకు సొమ్ములు రైతు ఖాతాలో జమయ్యేవి. జగన్ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. సకాలంలో సొమ్ములు జమ కావడంలేదు. దీంతో ధాన్యం రైతులకు ప్రభుత్వంపై నమ్మకం పోయింది. నేడు కోసిన ధాన్యాన్ని కళ్లంలోనే దళారులు సరసమైన ధరకు కొనుగోలు చేస్తున్నారు. - ఆచంట కోటేశ్వరరావు, కౌలురైతు, చెరుకుమిల్లి

తాళ్లపూడిలో రూ.81.72 లక్షలు బకాయి..

తాళ్లపూడి, మే 19 : తాళ్లపూడి మండలంలో రబీ సీజన్‌లో ధాన్యం కొను గోళ్లు 90 శాతం పూర్తయినట్టు ఏవో రుచిత తెలిపారు. ఇప్పటి వరకూ 16,163 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 15.84 కోట్లు రైతులకు చెల్లించాం. 81.72 లక్షలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. సుమారు 300 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయవలసి ఉంది.

పెరవలిలో ఇంకనూ పడని సొమ్ములు

పెరవలి, మే 19 : మండలంలో వరి కోతలు పూర్తయ్యాయి. నగం మంది రైతులు ప్రభుత్వంతో ప్రమేయం లేకుండా ప్రైవేటు వ్యక్తులకు విక్రయించుకోగా కొంత మంది రైతులు మాత్రం ప్రభుత్వానికి విక్రయించారు. మండల వ్యాప్తంగా 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించారు. కొంత మందికి మాత్రమే సొమ్ములు పడ్డాయి. చాలా మంది రైతులకు మాత్రం సొమ్ములు పడకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.ధాన్యం విక్రయించిన అనంతరం వారానికే బ్యాంక్‌లో సొమ్ములు పడాల్సి ఉన్నా నెల రోజులైనా నేటికీ పడకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

18 రోజులుగా ఆగిన చెల్లింపులు

చాగల్లు, మే 19 : రైతులకు ధాన్యం సొమ్ములు చెల్లించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలో 3360 హెక్టార్లలో రైతులు రబీ సాగుచేశారు. రైతులు మిల్లులకు ధాన్యం తరలించినా సొమ్ములు చెల్లింపులో ఇబ్బం దులు పడుతున్నారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు రైతులు నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సొమ్ములు చెల్లించారు. నేటి వరకూ మిగిలిన సొమ్ములు చెల్లించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.





కురిసింది చిరుజల్లు : వాన కారణంగా ఖాళీగా ఉన్న నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్

కురిసింది వాన..



రోజూలాగే ఉదయమే భానుడు వచ్చాడు.. అంతకంతకూ తన ప్రతాపం చూపుతూనే ఉన్నాడు.. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలు దాటింది.. భానుడి ఉగ్రరూపం అలాగే ఉంది.. నాలుగు రోజులు వర్షాలన్నారు.. ఎక్కడా ఆ జాడే లేదు.. అనుకుంటుండగానే ఆకాశం నల్లగా మారిపోయింది.. అయినా ఉక్కపోత మాత్రం తగ్గలేదు.. ఆ ఏం వాన పడుతుందిలే అనుకున్నారంతా.. అంతే చిరు జల్లులతో ఆరంభమైన వాన అలా అలా పెరిగింది.. భానుడికి దారివ్వకుండా సాయంత్రం వరకూ పడుతూనే ఉంది.. జిల్లా వ్యాప్తంగా సుమారు 3 గంటల పాటు వానపడింది. సాయంత్రం 4 గంటలకు వరుణదేవుడు కాస్త తెరిపిచ్చాడు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో జనం ఊపిరిపీల్చుకున్నారు.. - నిడదవోలు /రాజమహేంద్రవరం సిటీ

ర్యాంపుల్లో నిబంధనలు అతిక్రమించవద్దు : కలెక్టర్
వ్యాన్ ఢీకొని.. యువకుడి మృతి 8



నిలిచిన రిజిస్ట్రేషన్లు

- జగనన్న సర్వే పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లకు బ్రేక్
- రాజానగరం నియోజకవర్గంలో ఇబ్బంది
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటున్న కక్షిదారులు

సీతానగరం మే 19 : వైఎస్ఆర్ జగనన్న సమగ్ర భూ సర్వే కారణంగా రాజానగరం నియోజకవర్గంలోని మేజర్ గ్రామాల్లో భూమి రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి.దీంతో ఎప్పుడు జనంతో కిటకిటలాడే సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు వెలవెలబోతున్నాయి.దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం, వంగలపూడి, శింగవరం, సీతానగరం, నాగంపల్లి, ముగ్గుళ్ళ, కూనవరం, బొబ్బిల్లంక, నల్గొండ గ్రామాల వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కోరుకొండ మండలంలో కాపవరం, బుచ్చంపేట ,బూరుగుపూడి తదితర సుమారు 10 గ్రామాలు రాజానగరం మండలంలోని కొన్ని గ్రామాలు రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. జగనన్న సమగ్ర భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో గతంలోని సర్వే నెంబర్ల స్థానంలో ఎల్‌పీ నెంబర్లు ఇవ్వడం ఆ నెంబర్లు సర్వర్లలో అప్‌లోడ్ చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి ఎదురైంది. ప్రభుత్వ గెజిట్‌లో పొందుపర్చిన తరువాత గాని అప్‌లోడ్ చేయడం కుదరదని తెలుస్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి రైతాంగం లబోదిబోమంటున్నారు. అప్‌లోడ్ చేయాలంటే ఎన్నికల వేళ కష్టమే. కౌంటింగ్ పూర్తయి కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత మాత్రమే అయ్యే అవకాశం ఉన్నందున సుమారు మరొక రెండు నెలల వరకు ఇబ్బందులు తప్పవని తెలుస్తోంది. రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. తనఖా పెట్టుకుని అప్పులు తెచ్చుకుందామన్నా, ఉన్న భూమి అమ్ముకుని అప్పులు తీర్చుకుందామన్నా అవకాశం లేకపోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.క్రయ విక్రయాలు జరగక రిజిస్ట్రారు కార్యాలయాలు ఖాళీగా ఉంటున్నాయి.ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్థానాలు మారినా గెలిచేనా!?



హోం మంత్రి తానేటి వనిత

జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణు

- మంత్రుల స్థానాలపై తీవ్ర చర్చ
- ఎన్నికల ముందు ఇద్దరూ బదిలీ
- వేర్వేరు నియోజకవర్గాల్లో పోటీ
- గోపాలపురం నుంచి వనిత
- రాజమండ్రి రూరల్ నుంచి వేణు
- హోరాహోరీగా సాగిన పోరు
- మరో 15 రోజుల్లో ఫలితాలు
- కూటమి అభ్యర్థులకు మొగ్గు
- వైసీపీ మేకపోతు గాంభీర్యం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు అయిపోయాయి..లెక్కింపు మాత్రమే మిగిలి ఉంది. మరో 15 రోజుల్లో ఎవరు గెలిచారు.. ఎవరు ఓడారు అనేది తేలిపోనుంది. అయినా ఫలితాలపై మాత్రం ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో 5 నియోజకవర్గాలది ఒక ఎత్తు.. రాజమహేంద్రవరం రూరల్, గోపాలపురం నియోజకవర్గాలది మరో ఎత్తు.. ఇక్కడి నుంచి ప్రస్తుతం అధికారంలో ఉన్న ఇద్దరు మంత్రులు పోటీపడ్డారు. ఈ ఇద్దరూ బదిలీపై వచ్చి గతంలో ఉన్న స్థానాల్లో కాకుండా వేరొక స్థానాల్లో పోటీపడడం విశేషం. దీంతో పోలింగ్ తర్వాత జిల్లాలోని ఇద్దరు మంత్రుల గెలుపోటములపై ప్రజల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది. వైసీపీకి వ్యతిరేకంగా ఓ సైలెంట్ వేవ్ ఉందని అందరూ కోడై కూస్తుంటే.. వైసీపీలో కొందరు ఓ పక్క ఓడిపోతామనే భయమున్నా..మరో పక్క మహిళ ఓట్లన్నీ తమకే పడ్డాయి అనుకుంటూ బలవంతంగా తమ ఖాతాలో వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన సంగతి తెలిసిందే. వాస్తవానికి ఆయన గత ఎన్నికల్లో అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున పోటీ చేసి గెలిచి.. బీసీల్లోని శెట్టిబలిజ కోటా కింద మంత్రి అయ్యారు. మూడు శాఖలు నిర్వహించారు. కానీ పవరంతా సీఎం జగన్ చేతిలో ఉండిపోవడంతో ఈ మూడు శాఖల ద్వారా ఆయన పెద్దగా గుర్తింపు పొందిందేమీ లేదు. ఎన్నికల ముందు జగన్ ఆయనను బలవంతంగా రామచంద్రపురం నుంచి బదిలీ చేసి రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీ చేయించిన సంగతి తెలిసిందే. తానేటి వనిత గత ఎన్నికల్లో కొవ్వూరు ఎస్సీ నియోజకవర్గం నుంచి గెలిచి ఐదేళ్లపాటు మంత్రి ఉన్న సంగతి తెలిసిందే. ఆమె మొదట మహిళా శిశుసంక్షేమ శాఖ, ప్రస్తుతం హోంశాఖ మంత్రిగా ఉన్నారు.ఆమెకు ఈ శాఖలు అదనంగా తెచ్చిన పలుకుబడీ ఏమీ లేదు. కానీ హోంమంత్రిగా సొంత నియోజకవర్గంలో బ్యాడ్ అయ్యారు. పైగా అక్కడ ఓ ముఖ్యవర్గాన్ని దూరంపెట్టే ప్రయత్నం చేయడంతో ఏకంగా ఆమె స్థానమే మారాల్సి వచ్చింది.జగన్ ఆమెను కూడా బదిలీ చేసి గోపాలపురం నియోజకవర్గం నుంచి పోటీ చేయించిన సంగతి తెలిసిందే. ఎన్నికల తర్వాత వీరిద్దరూ గెలుస్తారా? ఓడిపోతారా అనేది పెద్ద చర్చనీయాంశమైంది.గోపాలపురం నియోజక వర్గంలో మొత్తం 2,42,763 ఓటర్లు ఉండగా 2,10,399 మంది ఓటేశారు. ఇది 86.67 శాతం. ఇందులో మహిళలు 1,23,793 మంది ఉండగా 1,05,564 మంది ఓటేశారు. పురుషులు 1,18,965 మంది ఉండగా 1,04,831 మంది ఓటేశారు. ఉదయం నుంచి ఓటర్లు పోలో మంటూ రావడంతో కూటమి వర్గాల్లో ఆనందం వ్యక్తమ వుతోంది. ఇక్కడ టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజుకే విజయావకాశాలు ఎక్కువ ఉంటాయనే అంచనా ఉంది. దీనిపై జూన్ 4వ తేదీన స్పష్టత రాబోతోంది. ఇక రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీ చేసిన మంత్రి చెల్లుబోయిన వేణుకు కూడా కష్టకాలమనే అంచ నాలు ఉన్నాయి.ఈ నియోజకవర్గం ఎపుడూ టీడీపీకి కంచుకోట. నియోజకవర్గంలో మొత్తం 2,72,826 మంది ఓటర్లు ఉండగా 1,99,220 మంది ఓటేశారు.ఇది 73.02 శాతం. ఇక్కడ 1,33,241 మంది పురుష ఓటర్లు ఉండగా 97,530 మంది ఓటేశారు.1,39,561 మంది మహిళా ఓటర్లు ఉండగా 1,01,673 మంది ఓటేశారు. ఇక్కడ రెండుసార్లు విజయఢంకా మోగించిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో వేణు తలపడ్డారు. గోరంట్లకు అభిమాన ఓటర్లు ఉన్నారు. పైగా జనసేన, బీజేపీ ఓట్లన్నీ కలిసొచ్చాయి. దీంతో గోరంట్లదే గెలుపు అనే ప్రచారం జరుగుతోంది. ఇలా జగన్ బదిలీ చేసిన ఇద్దరు మంత్రులకు చుక్కెదురవుతుందని అంచనా.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



నిడదవోలు, మే 19: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు, క్షీర నివేదన, మహానివేదన చేశారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ఆలయానికి పలు జిల్లాల నుంచి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్ల ద్వారా రూ.1,74,097 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు. అలాగే ఆలయ ఆవరవణలో మద్దుల సత్యనారాయయణ, లక్ష్మీ దంపతులు 100 లీటర్ల పెరుగును మజ్జిగ చలివేంద్రానికి అందజేశారు.

రాజ్యాంగాన్ని మార్చే దమ్ము బీజేపీకి లేదు..

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యామ్

కొవ్వూరు, మే 19: భారత రాజ్యాంగాన్ని మార్చే దమ్ము బీజేపీకి లేదని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొంతా శ్యామ్ రవిప్రకాష్ అన్నారు. ఆ పార్టీకి దేశవ్యాప్తంగా 250 సీట్లు కూడా రావని, రాజ్యాంగం మార్చాలంటే 363 సీట్లు ఒకే పార్టీకి రావాలని ఆ పరిస్థితి బీజేపీకి లేదన్నారు. అధికారం చేపట్టిన వెంటనే స్విస్ బ్యాంకు నుంచి నల్లధనం వెనక్కి తీసుకొస్తానని చెప్పిన మోదీ ప్రజలను మోసం చేశారన్నారు. కరోనా సమయంలో అనాలోచిత నిర్ణయంతో లాక్‌డౌన్ ప్రకటించి, అనేకమంది ఉపాధి కార్మికుల మరణానికి కారణమయ్యారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలైన స్టీల్ ప్లాంట్, రైల్వే, బీఎస్ఎన్ఎల్‌ను ప్రైవేటుపరం చేసి, దేశ సంపాదన ప్రైవేటు వ్యక్తులకు దోచి పెట్టాలని అనుకోవడం దుర్మార్గమని శ్యాం రవిప్రకాష్ అన్నారు.

వ్యాయామంతో మధుమేహం నియంత్రణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సిద్ధార్థ కన్నాజీ

నిడదవోలు, మే 19: ఆహార నియమాలతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం మందులు వాడకం ద్వారా మధుమేహ వ్యాధిని నియంత్రణలో ఉంచుకోవచ్చని సిరి ఎమర్జెన్సీస్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సిద్ధార్థ కన్నాజీ అన్నారు. ఆదివారం నిడదవోలులోని గాంధీనగర్‌లో నిర్వహించిన వాకర్స్‌క్లబ్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యాయామానికి సమయం కేటాయించాలని, జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ మహిళా అధ్యక్షురాలు సూర్యకాంతం, కొండా నిర్మల, శ్రీనివాస్, లక్ష్మి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బాటిళ్లలో పెట్రోల్ అమ్మకాలు నిషేధం

ఉండ్రాజవరం/దేవరపల్లి, మే 19: మండలంలోని పెట్రోల్ బంక్‌ల్లో బాటిళ్లు, టిన్నుల్లో పెట్రోలు, డీజిల్ అమ్మకాలను ప్రభుత్వం నిషేధించినట్టు ఉండ్రాజవరం, దేవరపల్లి ఎస్‌ఐలు వి.అప్పలరాజు, శ్రీహరిరావు తెలిపారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. కిరాణ షాపులు, బడ్డీకొట్లలో పెట్రోల్ అమ్మరాదన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు బాణసంచా అమ్మకాలు, కొనుగోలు నిషేధించినట్టు ఎస్‌ఐ చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి



కొవ్వొత్తులు వెలిగించి హెచ్‌ఐవీ మృతులకు సంఘీభావం తెలుపుతున్న ఐసీటీసీ సిబ్బంది

కొవ్వూరు, మే 19: ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించడంలో మనమంతా భాగస్వామ్యం కావాలని డాక్టర్ సుభాషిణి అన్నారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం ఐసీటీసీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినాన్ని నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి హెచ్‌ఐవీతో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. డాక్టర్ సుభాషిణి మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులకు భరోసా కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారన్నారు. ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ వి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 20 ఏళ్లలో 1,45,000 మంది మరణించగా 2,22,300 మంది ఎఆర్‌టీ మందులు వాడుతూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తున్నారన్నారు. జిల్లాలో 25,640 మంది హెచ్‌ఐవీ బాధితులను గుర్తించగా వారిలో 14,713 మంది ఎఆర్‌టీ మందులు వాడుతూ ఆరోగ్యంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో రోజ్‌మేరి, పి.లలితకుమారి, లక్ష్మిగౌతమి, కె.దాసుబాబు పాల్గొన్నారు.

వెలగదుర్రులో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

ఉండ్రాజవరం, మే 19: మండలంలోని వెలగదుర్రు గ్రామంలోని ఎస్సీ ఏరియాలోని రామాలయంలో ఆదివారం సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేదుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నల్లజర్లలో ఫ్యామిలీ డాక్టర్ డే



మాట్లాడుతున్న డాక్టర్స్ గంగాధర్, సిరాజుద్దీన్

నల్లజర్ల, మే 19: గ్రామీణ వైద్య సేవలకు చక్కని సందేశం ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్ డే అని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ గంగాధర్, సిరాజ్ ఉద్దీన్ అన్నారు. ఆదివారం నల్లజర్ల పీహెచ్‌లో ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ 90శాతం ఆరోగ్య సమస్యలను సరైన ప్రాథమిక వైద్య సేవల ద్వారా గుర్తించి సకాలంలో చికిత్స చేస్తే ఆసుపత్రిలో చేరకుండానే నయమవుతాయన్నారు. పేదలకు ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలు పొందాలని, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి అప్పుల పాలు కావద్దన్నారు. కార్యక్రమంలో జీవీవీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు



చాగల్లు, మే 19: మండలంలోని చంద్రవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు, యువత, సహా అన్ని వర్గాల వారిని గ్రంథాలయానికి రప్పించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచినట్టు లైబ్రేరియన్ కె.సుమన్‌కుమార్ తెలిపారు. విజ్ఞానం, వినోదం, యువతకు విద్య ఉద్యోగ అవకాశాలు కల్పించేవిధంగా తగిన ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. అందరు వీటిని ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పాఠకులను కోరారు.

ఘనంగా శ్రీనివాసుడి కల్యాణం

బిక్కవోలు, మే 19: మండలంలో పలు చోట్ల శ్రీనివాసుని కల్యాణాలు ఘనంగా నిర్వహించారు. కొమరిపాలెంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడి కల్యాణం సందర్భంగా ఆదివారం అనపర్తి కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈయన వెంట రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి, డీవీఆర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బిక్కవోలు పార్కు వీధిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు.

ఇసుక లోడింగ్‌కు యంత్రాలు వద్దు



కుమారదేవంలో ఇసుక తవ్వకాల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

- లోడింగ్‌కు యంత్రాలు వినియోగిస్తే సీజ్ చేస్తాం
- వంతెనలకు 500 మీటర్ల లోపు ఇసుక తవ్వకాలు నిషేధం
- అనుమతి పొందిన వారే డ్రెడ్జింగ్ చేయాలి
- కలెక్టర్ మాధవీలత.. పలు ఇసుక ర్యాంపులు తనిఖీ

కొవ్వూరు/తాళ్లపూడి/కడియం, మే 19: గోదావరి నదిపై ఉన్న వంతెనలకు 500 మీటర్ల లోపు ఎటువంటి ఇసుక తవ్వకాలు చేపట్టరాదని, నిబంధనలు అతిక్రమించి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత హెచ్చరించారు. ఆదివారం కొవ్వూరు మండలం కుమారదేవం, చిడిపి, తాళ్లపూడి మండలం బల్లిపాడు, కడియం మండలం వేమగిరి గ్రామాల్లోని ఇసుక ర్యాంపులను అధికారులతో కలిసి ఆమె తనిఖీ చేశారు. గోదావరి నదిలో ఇసుక తవ్వకాలకు సంబంధించి ఓపెన్ రీచెస్, బోట్స్‌మేన్ సొసైటీలు, డ్రెడ్జింగ్ తవ్వకాలపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ ఇసుకర్యాంపులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు టెండర్లు పిలిచి 3 కిలోమీటర్ల నుంచి 12 కిలోమీటర్ల వరకు ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చారన్నారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నారన్నారు. హైకోర్టు ఆదేశాలమేరకు క్షేత్రస్థాయి పర్యటన చేపట్టామన్నారు. ఓపెన్ రీచ్‌లలో గోదావరి నది ప్రాంతంలో వాహనాలను వినియోగించరాదన్నారు. లోడింగ్‌కు టిప్పర్లు, ప్రొక్లెయినర్‌లు వినియోగిస్తున్నారని వాటిని సీజ్ చేస్తామన్నారు. బోట్స్‌మేన్ సొసైటీల వారు డ్రెడ్జింగ్ చేస్తున్నారని, అనుమతి పొందిన వారు మాత్రమే డ్రెడ్జింగ్ చేయాలన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద వాహనాలతో లోడింగ్ చేసుకోవచ్చునన్నారు. ర్యాంపుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి హైకోర్టుకు నివేదిక అందజేస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, డీఎస్పీ కేసీహెచ్ రామారావు, ఏజీఆర్‌టీ ఏఈ ఆర్.సునీల్‌బాబు, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సోమశేఖర్, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం, గ్రౌండ్‌వాటర్ డీడీ వై శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, ఇరిగేషన్ అధికారి ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, పెరవలి తహశీల్దార్ సుధ తదితరులున్నారు.



కొవ్వూరు: కుమారదేవంలో ఇసుకర్యాంపును తనిఖీ చేస్తున్న కలెక్టర్



తాళ్లపూడి: బల్లిపాడులో ఇసుక ర్యాంప్ పరిశీలిస్తున్న కలెక్టర్

కోనసీమ పరిధిలో ఇసుక తవ్వకాలు!

'రెవెన్యూ, మైనింగ్ అధికారులు తప్పించుకునే ఎత్తుగడ'

పెరవలి, మే 19: ఇసుక అక్రమ తవ్వకాలుపై ఆంధ్రజ్యోతిలో ఇటీవల వరుసగా కథనాలపై జిల్లా కలెక్టర్ మాధవీలత స్పందించారు. ఈ మేరకు అక్రమ ఇసుక తవ్వకాలు జరిపినట్టు ఆరోపణలు వచ్చిన ర్యాంప్‌లను ఆదివారం ఆమె పరిశీలించారు. జిల్లాలో పలు ర్యాంప్‌లతో పాటు తీపర్రు ర్యాంప్‌ను కూడా పరిశీలించారు.ఇక్కడ అనుమతి పొందిన వారు అక్రమంగా తమకు అనుమతించిన దానికంటే ఎక్కువ మొత్తంలో అక్రమ తవ్వకాలు జరిపినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇసుక అక్రమాలు జరిపిన గోదావరి ప్రాంతంలో నాలుగు రోజుల కిందట మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు పర్యటించి వివరాలు నమోదు చేశారు. అయితే ఆ సమయానికి అంత వరకు జరిపిన తవ్వకాలు ఆపి వేసి తవ్వకందారులు పరారవ్వడం, ఎటువంటి ఆనవాళ్లు లేకుండా అదే రోజు రాత్రి గండికొట్టి నీటిని వదిలి వేయడంతో ఆ ప్రదేశమంతా నీటితో నిండిపోయింది. దీంతో అక్రమ తవ్వకాలు నిగ్గు తేల్చేందుకు ప్రస్తుతం అధికారులకు అవకాశం లేకుండాపోయింది. అయితే ఇక్కడకు వచ్చిన కలెక్టర్ మాధవీలతకు.. స్థానిక రెవెన్యూ మైనింగ్ అధికారులు చెప్పిన ప్రకారం ఈ ప్రాంతంలో తవ్వకాలు జరిగిన ప్రాంతం కోనసీమలోకి వస్తుందని, ఆ జిల్లా అధికారులు ఇక్కడ పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దీంతో జిల్లా అధికారులు తమ బాధ్యతలు నుంచి తప్పించుకోవడానికి ఇదొక ఎత్తుగడగా స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ప్రతిమ కంపెనీకి అనుమతులు ఇచ్చినట్టు చెబుతున్నారు. అయితే అదే కంపెనీ ఇచ్చిన పరిధి కంటే కోనసీమ పరిధిలో కూడా తవ్వకాలు జరిగినట్టు చెబుతున్న అధికారులు అదే అంశాన్ని పరిగణలోకి తీసుకుని కేసులు న మోదు చేయాలి కదా అని ప్రశ్నిస్తున్నారు. తవ్వకందారులపై చర్యలు తీసుకోవాలంటే తూర్పుగోదావరి జిల్లా, కోనసీమ జిల్లా రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా బ్యారేజీ వద్ద నీరు రాకుండా అడ్డుకట్ట వేసి అక్రమాలు నిగ్గు తేల్చవచ్చునని, అలా కాకుండా బాధ్యతల నుంచి తప్పించుకోవడం,అక్రమార్కులకు మేలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసువ తవ్వకాలకు యంత్రాలను వినియోగించకూడదని కలెక్టర్ చెబుతుఆన్నరని, అయితే యంత్రాలు ఉపయోగించి మూడు నెలలుగా భారీ ఎత్తున తవ్వకాలు జరిపి కోట్లాది రూపాయలు కూడబెట్టుకున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రైతు సాయుధ పోరాటంలో సుందరయ్య కీలకం

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిలో సీపీఎం నాయకుడు రాంబాబు

నిడదవోలు, మే 19: స్వాతంత్ర్య ఉద్యమంలోను, రైతాంగ సాయుధ పోరాటంలోను సుందరయ్య కీలకపాత్రం పోషించారని సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పలుచోట్ల ఆదివారం నిర్వహించారు. నిడదవోలులోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో మొట్టమొదటి ప్రతిపక్ష నాయకుడిగా సుదీర్ఘకాలం పనిచేశారన్నారు. సమాజంలో కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో కింజంగి గోపి, పొదలి శ్రీనివాసరావు, డొంకా రమేష్, డానియేల్, యర్రా శ్రీను, లెనిన్, గండి శేఖర్ పాల్గొన్నారు.

కొవ్వూరు: స్థానిక బస్టాండ్ సెంటర్ బిల్డింగ్ వర్కర్స్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కొవ్వూరు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుకూరి దొరయ్య, బీరా రవి.. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు మాట్లాడుతూ సుందరయ్య పీడిత ప్రజల ఆశాజ్యోతి అని, తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట సారధిగా, దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు పార్టీ మార్కిస్టు ఉద్యమ నిర్మాతగా ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. తనకున్న వందల ఎకరాల సాగుభూమిని పేదలకు పంచారని, వ్యవసాయ కూలీల కూలి రేట్ల పెంపుకై పోరాడి సాధించారన్నారు. సమాజంలో కులవివక్షకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేశారన్నారు. కార్యక్రమంలో మైగాపుల నాగేశ్వరరావు, మాజీకిరెడ్డి హరిబాబు, ఎం.జ్యోతిబసు, రేఖ నాగేశ్వరరావు, ఎం.సాగర్, మల్లేశ్వరరావు, ఎం.ఇందిరా ప్రియదర్శిని, కార్మికులు పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ముప్పిడి అప్పారావు స్మారక స్థూపం వద్ద పార్టీ జెండా ఎగురవేసి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.సుందరబాబు, పి.చిన్నబాబు, దగ్గు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో సుందరయ్య చిత్రపటం వద్ద నినాదాలు



నిడదవోలులో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

దేవరపల్లి: దేవరపల్లిలో సుందరయ్య చిత్రపటానికి సీనియర్ కామ్రేడ్ ఉండవల్లి కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి అభివృద్ధికి సుందరయ్య విశేష కృషి చేశారని, ఆయన సేవలను ప్రతి కామ్రేడ్ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఆచంట సుభాష్‌చంద్రబోస్, ఎస్.భగత్, పెన్నమని సత్యనారాయణ, మల్లిపూడి వెంకటలక్ష్మి, వై.పడియ్య, మడేల్లి రామారావు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు





జాతీయ రహదారిపై ప్రమాద దృశ్యం, మృతుడు సాయికార్తీక్

కొవ్వూరు, మే 19: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా ఇద్దరు గాయపడినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపారు. కొవ్వూరులోని ఇందిరమ్మకాలనీకి చెందిన కల్లి పూర్ణ సాయికార్తీక్(21) తన స్నేహితులు కరగాని గణేష్, కురందాసు దుర్గలతో కలిసి బైక్‌పై కొవ్వూరు నుంచి దొమ్మేరు వైపు వెళ్తుండగా నందమూరు జగనన్న కాలనీ, కాపవరం గ్రామాల మధ్యలో ఎక్స్‌ప్రెస్ హైవే సర్వీస్ రోడ్‌లో అరటికాయల లోడ్‌తో వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికార్తీక్ అక్కడికక్కడే మృతి చెందగా గణేష్, దుర్గలకు తీవ్ర గాయాలకుల కావడంతో రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ కె.సుధాకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఘనంగా తాడేలమ్మ తీర్థ మహోత్సవాలు



దివాన్‌చెరువు, మే 19: పాలచర్లలో శ్రీ తాడేలమ్మ తీర్థ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదురోజులు పాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటి రోజైన ఆదివారం అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద బాణసంచా కాల్పులు, గరగనృత్యాలు, డప్పువాయిద్యాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాలు సందర్భంగా అమ్మవారికి రాజమహేంద్రవరానికి చెందిన భక్తుడు జామిఆదిశేఖర్ రూ.25 వేలు విలువైన వెండిపాదుకలు (శఠగోపం), కూరాకుల తాతారావు రూ.20 వేల వ్యయంతో ఇత్తడి మకర తోరణాన్ని అందజేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఐదో రోజు అన్నసమారధన జరుగుతుందన్నారు. కాగా ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పువ్వులు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

దివాన్‌చెరువులో ఉచిత వేసవి క్రీడా శిక్షణ



దివాన్‌చెరువు, మే 19: వాసు రేంజర్స్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో దివాన్‌చెరువులో వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు క్లబ్ సభ్యులు తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఈ శిబిరంలో ఖోఖో, కబడ్డీ క్రీడలకు నిపుణులతో శిక్షణ ఇస్తున్నారన్నారు. సుమారు 40 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారని, మరి కొందరు ఒకటిరెండు రోజుల్లో వస్తారన్నారు. జూన్ 10వ తేదీ వరకూ ఈ శిక్షణ కొనసాగుతుందని, ప్రవేశం పొందేందుకు ఆసక్తి ఉన్న వారు 92955 52543 నెంబరులో సంప్రదించాలని కోరారు.

పూడిక తీయరా?

తాళ్లపూడిలో చెత్తతో నిండిపోయిన మురుగునీటి కాలువ



తాళ్లపూడిలో చెత్తతో నిండిపోయిన మురుగునీటి కాలువ

తాళ్లపూడి, మే 19 : తాళ్లపూడి బస్టాండ్ సెంటరు సమీపంలోని వీధిలో మురుగునీరు నిల్వ ఉండి దుర్గంధం వస్తుండడంతో చిరువ్యాపారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్ అండ్‌బీ రోడ్డుకు మధ్యలో తూము ఏర్పాటు చేసి రోడ్డు వేశారు. వాడకం నీరు, వర్షపు నీరు, మురుగు కాలువ నీరు తూము ద్వారా కోనేరులోకి వెళ్లి పోయేది. కొంత కాలంగా చెత్త పేరుకుపోయి మురుగు నీటి కాలువలో నీరు నిల్వ ఉండిపోయి దుర్గంధం వస్తోంది. దీనిపై పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు మురుగు కాలువలోని చెత్తను తీయించి మురుగు నీరు కోనేరులోకి పోయే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జగనన్న కాలనీలో అక్రమ నిర్మాణాలు

అధికారులు సహకరిస్తున్నారని స్థానికుల ఫిర్యాదు



తిరుగుడుమెట్ట జగనన్న కాలనీలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలు

తాళ్లపూడి, మే 19 : మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామంలో జగనన్న కాలనీ ప్రభుత్వ లేఅవుటులో అనుమతులు లేకుండా ఇద్దరు బయట గ్రామాలకు చెందిన వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొవ్వూరు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఆధార్ కార్డు, రేషను కార్డులు లేని పాల మంగమ్మ, సాలి సురేంద్రబాబుల అక్రమ నిర్మాణాలకు స్థానిక అధికారులే సహకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్హత లేని వారి అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని కోరుతున్నారు.

మద్యంసీసాలతో వ్యక్తి అరెస్టు

దేవరపల్లి, మే 19: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించగా కృష్ణంపాలెం గ్రామంలో ఎనిమిది మద్యంసీసాలతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ స్వామి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలిలో భారీ వర్షం



కాకరపర్రులో నీట మునిగిన ఎస్సీ కాలనీ

పెరవలి, మే19: మండలంలో ఆదివారం మధ్యాహ్నాం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నాం వరకు విపరీతమైన ఎండ కాచింది. ఆపై ఆకాశం మబ్బులు కమ్మి వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆయా గ్రామాల్లో రోడ్లన్నీ కొద్ది సేపు నీటితో నిండిపోయాయి.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



యర్నగూడెం జడ్పీ హైస్కూల్ 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

దేవరపల్లి, మే 19: మండలంలోని యర్నగూడెం జడ్పీ హైస్కూల్లో 1998-99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఉదయం నుంచి పూర్వవిద్యార్థులు చిన్ననాటి సంగతులను తలచుకుని ఒకరికి ఒకరు చెప్పుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉదయం సాయంత్రం వరకూ గడిపారు.

వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు



చాగల్లులో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెరవలి, మే19: అన్నవరప్పాడులో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి, అమ్మ వార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేశారు. అనంతరం ఎదుర్కోలు ఉత్సవం, సాయంత్రం ఖండవల్లిరాజేశ్వరి వర ప్రసాదాచార్యులు, వాడపల్లి వెంకట శేషాచార్యులు, ఆలయ అర్చకుల పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. డాక్టర్ సాంబశివరావు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో వేంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు 5వ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్‌సేన ఆరాధన, కుంభారాధన, నిత్యహోమం, సువర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం, రాజమండ్రికి చెందిన సత్యశ్రావణి బృందంతో నృత్యప్రదర్శన, దేవరపల్లికి చెందిన కేసిరాజు శారదాదేవి శిష్యబృందంతో సంగీత కీర్తనమృత కార్యక్రమాలు నిర్వహించారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	లవ్‌గురు
వై.స్క్రీన్ 2	ఫ్యామిలీ స్టార్
దేవిశ్రీ(గాయత్రి)	మంజుమ్మల్ బాయ్స్
అనన్య	డీజే టిల్లు-2
నిడదవోలు	
వీ మ్యాక్స్	గాడ్జిల్లా వర్సెస్ కాంగ్
రాధాకృష్ణ	ఆ ఒక్కటి అడక్కు
శ్రీగణపతి	గీతాంజలి మళ్లీ వచ్చింది
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి